# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 50 | విశాఖపట్నం | 20-11-2025 గురువారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 50 | VISAKHAPATNAM | 20-11-2025 THURSDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934


## పుట్టపర్తి పవిత్ర భూమిలో

# ఏదో మహత్తు ఉంది: మోడీ





- పుట్టపర్తిలో ఘనంగా శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు
- రూ.100 స్మారక నాణెం, తపాలా బిళ్లను విడుదల చేసిన మోడీ
- హాజరైన సీఎం చంద్రబాబు, పవన్, సచిన్

**పుట్టపర్తి, పతాకం న్యూస్:** పుట్టపర్తిలో సత్యసాయి శతజయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధ వారం ఈ ఉత్సవాలకు ప్రధాని మోడీ హాజర య్యారు. ముందుగా పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని మోడీ పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. సత్యసాయి శత జయంత్యుత్సవానికి ఆయన హాజర య్యారు. సాయి కుల్వంత్ హాల్‌లో సత్యసాయి మహా సమాధిని ప్రధాని దర్శించు కున్నారు. ఆయన వెంట ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉన్నారు. అనంతరం హిల్ వ్యూ స్టేడియానికి మోదీ చేరు కున్నారు. బాబా జీవితం, బోధనలు, సేవల స్మారకార్థంగా రూపొందించిన రూ.100 నాణెం, 4 తపాలా బిళ్లలను ప్రధాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్, ప్రముఖ నటి ఐశ్వర్యారాయ్ తదితరులు హాజరయ్యారు. సత్యసాయి జయం త్యుత్సవాల్లో పాల్గొనడం తమ అదృష్టమని ప్రధాని మోడీ అన్నారు. సత్యసాయి భౌతికంగా లేకున్నా. ఆయన ప్రేమ మనతోనే ఉందన్నారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా ఆయన జీవించారని, భారతీయ నాగరికతకు సేవ మూల కేంద్రంన్నారు. భక్తి, జ్ఞానం, కర్మ ఈ మూడూ సేవతోనే ముడిపడి ఉంటా యన్నారు. సేవే పరమ ధర్మమని మన నాగరికత చెప్పిందని వివరించారు. బాబా బోధనలు లక్షల మందికి మార్గం చూపాయని, అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు ఇదే బాబా నినాదమని, ఆయన బోధనల ప్రభావం దేశమంతా కనిపిస్తుందన్నారు. కోట్ల మంది బాబా భక్తులు మానవసేవ చేస్తున్నారని, బాబా ప్రేమ సూత్రాలు ఎందరినో ఆలోచింపజేశాయన్నారు. చాలామంది జీవితాలను (తరువాయి 2వ పేజీలో)

# అన్నదాత నిధులు విడుదల చేసిన చంద్రబాబు



**కడప, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద రెండో విడత నిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. కడప జిల్లా పర్యటనలో భాగంగా పెండ్లిమర్రిలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక నుంచి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 47 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.3,200 కోట్లు జమ అయ్యాయి. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలోని పెండ్లిమర్రిలో పర్యటించిన సీఎం చంద్రబాబు, తొలుత 'మన గ్రోమోర్' ఎరువుల కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ స్థానిక రైతులతో కాసేపు ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభ నుంచి నిధులను విడుదల చేశారు. ఈ పథకం కింద అర్హులైన ప్రతి రైతు ఖాతాలో రూ.7 వేల చొప్పున జమ అయినట్లు అధికారులు తెలిపారు.

ఇదే సమయంలో, ఈ పథకంలోని కేంద్ర ప్రభుత్వ వాటా అయిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధులను ప్రధాని నరేంద్ర మోదీ తమిళనాడులోని కోయంబత్తూర్ నుంచి విడుదల చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం రైతులకు పెట్టుబడి ఖర్చులకు అండగా నిలుస్తుందని ప్రభుత్వం పేర్కొంది.

## 16 నెలల్లో 120 బిలియన్ డాలర్ల

# పెట్టుబడులు ఆకర్షించాం: లోకేశ్



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న అభివృద్ధి ప్రస్థానంపై, ముఖ్యంగా తన గురించి ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ 'రాయిటర్స్' ప్రత్యేక కథనాన్ని ప్రచురించడం పట్ల రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. కేవలం 16 నెలల వ్యవధిలోనే రాష్ట్రానికి 120 బిలియన్ డాలర్ల (సుమారు రూ.10 లక్షల కోట్లు) భారీ పెట్టుబడులను ఆకర్షించడం తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఆయన అన్నారు. వ్యాపార నిర్వహణలో వేగం, పారదర్శకత, సాహసోపేతమైన సంస్కరణల ఎజెండాపై తమ ప్రభుత్వం స్థిరంగా దృష్టి సారించడం వల్లే ఇది సాధ్యమైందని లోకేశ్ వివరించారు. ఈ విజయాల ఫలితంగా సుపరిపాలన, ఆర్థిక పునరుజ్జీవంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఒక ఆదర్శ నమూనాగా నిలుస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెట్టుబడులకు స్వర్గధామంగా మారుతోంది. కేవలం 16 నెలల వ్యవధిలో ఏకంగా 120 బిలియన్ డాలర్ల (సుమారు రూ.10 లక్షల కోట్లు) పెట్టుబడుల ఒప్పందాలను సాధించి దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేసిన 42 ఏళ్ల నారా లోకేశ్, రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో కీలక శక్తిగా నిలుస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంలో తమ పార్టీకున్న పలుకుబడిని ఉపయోగించుకుంటూ, అధికారిక జాప్యాన్ని అధిగమించి, బిలియన్ డాలర్ల ప్రాజెక్టులకు సైతం వేగంగా అనుమతులు సాధిస్తున్నారు. ఆయన తండ్రి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండటం, కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామిగా ఉండటం రాష్ట్రానికి ఎంతో కలిసి వస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వ్యూహం అద్భుతమైన ఫలితాలనిస్తోంది. టెక్ దిగ్గజం గూగుల్, భారతదేశంలోనే తన అతిపెద్ద పెట్టుబడిగా (తరువాయి 4వ పేజీలో)

## విశాఖ సమీపంలో టాటానగర్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన పెను ప్రమాదం



**పెందుర్తి, పతాకం న్యూస్:** విశాఖ సమీపంలో టాటానగర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు పెను ప్రమాదం తప్పింది. పెందుర్తి రైల్వే స్టేషన్ సమీపంలో విద్యుత్ లైన్ పనులు జరుగుతుండగా విద్యుత్ పోల్ పక్కకు ఒరిగింది. అదే సమయంలో ఆ మార్గంలో టాటానగర్ ఎక్స్‌ప్రెస్ వస్తుంది.. లోకో పైలట్ అప్రమత్తమై రైలును నిలిపి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ వైర్లపై స్తంభం పడటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనతో దాదాపు గంట పాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. రైల్వే సాంకేతిక నిపుణులు ఆ మార్గంలో పునరుద్ధరణ పనులు చేపట్టారు.

# శబరిమల రైళ్లు ఫుల్



7లో

# ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభించిన రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. దీనికిముందుగా నెక్లెస్ రోడ్‌లో ఇందిరా విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, సీతక్క పాల్గన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నారు. డిసెంబర్ 9 వరకు గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

రెండవ దశ కింద పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుంచి మార్చి 8 వరకు చీరల పంపిణీ పూర్తి చేయాలని సిఎం రేవంత్ ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ కోసం చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులు తయారుచేశారు. ఉత్పత్తి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఉత్పత్తికి అనుగుణంగా చీరల పంపిణీని రెండు దశల్లో చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు.



## చెవిరెడ్డి కుటుంబ ఆస్తుల జప్తు... ఏపీ ప్రభుత్వం సంచలన ఆదేశాలు

2లో


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY — తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## తరిమికొడదాం

పపంచవ్యాప్తంగా నమోదవుతున్న క్షయ కేసులలో 25 శాతం మన దేశంలోనే నమోదవడం తీవ్ర ఆందోళనకరం. విశ్వవ్యాప్తంగా ఈ మహమ్మారి బారినపడిన దేశాల్లో మొదటి స్థానంలో భారత్ కొనసాగుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదిక వెల్లడించింది. 2015-25 మధ్య 50 శాతం కేసులు తగ్గిస్తామని కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యం 28 శాతం వద్దే చతికిలపడింది. 2024లో ప్రపంచవ్యాప్తంగా 83 లక్షల కొత్త టిబి కేసులు వెలుగుచూస్తే, వాటిలో 26 లక్షల 18 వేలకు పైగా కేసులు నమోదైంది మన దేశంలోనే. ఇవి కాకుండా ఇండియాతోపాటు అభివృద్ధి చెందిన దేశాల్లో గుర్తించని కేసులు అత్యధికంగా ఉన్నాయి. మన తరువాత స్థానంలో॰॰% ఇండోనేషియాలో 10 శాతం, ఫిలిప్పైన్స్‌లో 6.8 శాతం, చైనాలో 6.5 శాతం, పాకిస్తాన్‌లో 6.3 శాతం, నైజీరియాలో 4.8 శాతం, బంగ్లాదేశ్‌లో 3.6 శాతం కేసులు నమోదవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 12.3 లక్షల మంది ఈ మహమ్మారి వల్ల ప్రాణాలు కోల్పోతుండగా, వారిలో నాలుగోవంతు భారతీయులే. మరోవైపు ఔషధాలకు లొంగని మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ టిబి కేసుల్లో 32 శాతం మనదేశంలోనే నమోదయ్యాయి. 85 శాతానికిపైగా టిబి రోగులకు చికిత్స అందుబాట్లో ఉన్నా॰॰% ఖరీదైన మందులు కొనుగోలు చేయలేక సతమతమవుతున్నారు. 20 శాతం మంది రోగులు తమ ఆదాయంలో 20 శాతానికిపైగా ఈ వైద్యానికే ఖర్చు చేయాల్సి వస్తోంది. 2015లో ప్రతి లక్ష జనాభాకు కొత్త టిబి కేసుల సంఖ్య 237 ఉండగా, ఇప్పుడు 187కి తగ్గిందని, మరణాలు ప్రతి లక్ష జనాభాకు 28 నుంచి 21కి తగ్గాయని చెబుతోంది. కేంద్ర బడ్జెట్‌లో ఈ మహమ్మారిని ఎదుర్కొనేందుకు కేటాయిస్తున్న నిధులకూ, ఆ తరువాత వినియోగిస్తున్న వాటికీ మధ్య హస్తిమసికాంతరం ఉంటోంది. 2023-24 కేంద్ర బడ్జెట్‌లో రూ.31 వేల కోట్లు కేటాయిస్తే వినియోగించింది రూ.8 వేల కోట్లే. యుఎస్ ఎయిడ్ 2024-25లో నిలిచిపోయింది. ప్రపంచబ్యాంకు నిధులు రుణంగానే అందుతున్నాయి. క్షయ నియంత్రణకు ప్రపంచవ్యాప్తంగా 22 బిలియన్ డాలర్లు అవసరం కాగా, అందుబాట్లో ఉన్నవి 5.9 బిలియన్ డాలర్లే. అంటే లక్ష్యంలో 27 శాతమే. ఈ పరిస్థితుల్లో టిబి నియంత్రణకు ఇతో ధికంగా తోడ్పాటునందించాల్సిన కేంద్రం.. వాస్తవాలను విస్మ రించి టిబిని నియంత్రిస్తున్నామంటూ ప్రచారం చేసుకోవడం తగని పని. ప్రపంచం నుంచి టిబిని 2030 నాటికి తరిమివేయాలని ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు నిర్దేశించగా, 2025 నాటికే తరిమివేస్తామని మన పాల కులు గతంలో ప్రకటించారు. కొత్తగా టిబి కేసుల నమోదులో బిజెపి, ఎన్‌డిఎ నేతృత్వంలోని ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, మధ్యప్రదేశ్, ఢిల్లీ తొలి ఐదుస్థానాల్లో ఉన్నాయి. అందుకు భిన్నంగా మహమ్మారిని తరిమికొట్టిన రాష్ట్రాల్లో కేరళ అగ్రస్థానంలో నిలవగా, ఆ తరువాత స్థానంలో తమిళనాడు నిలిచింది. అత్యధిక సంఖ్యలో అధునాతన ఎన్‌ఎటి టిబి పరీక్షలు నిర్వహించినందుకు 2022 నుంచి ఈ ఏడాది వరకూ వరుసగా జాతీయ అవార్డులను పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సొంతం చేసుకోవడం క్షయ నియంత్రణలో కేరళ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. మనదేశంలో మూడొంతుల జనాభా నేటికీ పేదరికంలో మగ్గిపోతున్నారు. ఐదేళ్లలోపు పిల్లల్లో 37 శాతం మంది పౌష్టికాహార లోపంతో ఉన్నవారే. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, చిన్నారులు పోషకాహారం అందక పోవడంతో క్షయ లాంటి వ్యాధుల చికిత్సలో వినియోగించే మందుల ప్రభావాన్ని తట్టుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారు. పెరిగిపోతున్న కాలుష్యం, డయాబెటిస్, పొగతాగడం, మద్యం సేవించడం, హెచ్ఐవి, క్షయ మందులు మధ్యలో మానివేయడం ఇవన్నీ క్షయ విజృంభణకు ఆజ్యం పోస్తున్నాయి. కోవిడ్ సమయంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అండగా ఉన్న ఉపాధిహామీకి కేంద్రం నిధులు తెగ్గోస్తోంది. 2020-21లో 1,09,000 కోట్లుగా ఉన్న ఉపాధి హామీ నిధులు 2025-26లో 86 వేల కోట్లకే పరిమితమయ్యాయి. తీవ్ర పేదరికాన్ని తరిమికొట్టి.. సామాన్యుల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్న కేరళలోని ఎల్‌డిఎఫ్ మోడల్ దేశవ్యాప్తంగా అమలు చేసినప్పుడే క్షయ లాంటి మహమ్మారుల పీచమణచడం, దేశ ప్రజల సర్వతోముఖాభివృద్ధి సాధ్యం.

## చెవిరెడ్డి కుటుంబ ఆస్తుల జప్తు... ఏపీ ప్రభుత్వం సంచలన ఆదేశాలు




**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులను జప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చేసిన సిఫార్సులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు ఆయన కుమారులు మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డి, కేవీఎస్ ఇన్‌ఫ్రా ఎండీ చెవిరెడ్డి లక్ష్మి పేరిట ఉన్న చర, స్థిరాస్తులన్నింటినీ జప్తు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని భూములు, ఇతర ఆస్తులు ఈ జాబితాలో ఉన్నాయి. మద్యం కుంభకోణం ద్వారా చెవిరెడ్డి కుటుంబం అక్రమ మార్గాల్లో భారీగా ఆస్తులు కూడబెట్టిందని సిట్ తన విచారణలో గుర్తించింది. సుమారు రూ. 54.87 కోట్ల నల్లధనాన్ని అధికార అండతో భూ లావాదేవీల ద్వారా మళ్లించినట్టు సిట్ నిర్ధారించింది. ఈ మేరకు సిట్ చేసిన విజ్ఞప్తి ఆధారంగా హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ అవినీతి నిరోధక చట్టం కింద ఈ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి చర్యలు చేపట్టాలని డీజీపీని ప్రభుత్వం ఆదేశించింది.

## ఏపీ ఏజెన్సీలో మరో ఎన్‌కౌంటర్ – ఏడుగురు మావోయిస్టుల మృతి



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ ఏజెన్సీలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మరోసారి ఎదురుకాల్పులు జరిగాయి. బుధవారం తెల్లవారుజామున భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారిగా తెలుస్తోంది. మృతుల్లో మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ ఉన్నట్లు సమాచారం. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతోంది. మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌ను ఏపీ ఇంటెలిజెన్స్ డీజీ మహేశ్‌చంద్ర లడ్డా ధ్రువీకరించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు అందాల్సి ఉందని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మిగిలిన మావోయిస్టులు లొంగిపోవడం మంచిదన్నారు.“ఛత్తీస్‌గఢ్, తెలంగాణ నుంచి ఏపీకి రావడానికి మావోయిస్టులు ప్రయత్నిస్తున్నారు. పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసి కదలికలను గమనిస్తున్నాం. నవంబరు 17న ఒక ఆపరేషన్ లాంచ్ చేశాం. 18న ఉదయం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. సెంట్రల్ కమిటీ మెంబర్ హిడ్మా మద్వితో పాటు మరో ఐదుగురు మావోయిస్టులు హతమయ్యారు. మరోవైపు ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో 50 మందిని అరెస్టు చేశాం. వీరిలో స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్లు ముగ్గురు, ప్లాటూన్ మెంబర్లు 23 మంది, డివిజినల్ కమిటీ మెంబర్లు ఐదుగురు, ఏరియా కమిటీ మెంబర్లు 19 మంది ఉన్నారు. ప్రజలకు ఎక్కడా హాని జరగకుండా ఈ అరెస్టులు చేశాం. దొరికిన మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు కూడా స్వాధీనం చేసుకున్నాం. మంగళవారం జరిగిన మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ తర్వాత కొందరు మావోయిస్టులు పారిపోయారు. వారిని కూడా పట్టుకునేందుకు బృందాలు రంగంలోకి దిగాయి” అని ఏడీజీ తెలిపారు.

## ‘అన్నదాత సుఖీభవ -పిఎం కిసాన్ పథకం’ రెండో విడత విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా




**గాజువాక, పతాకం న్యూస్:** గాజువాక శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు బుధవారం పెద్దగంట్యాడలోని ఎమ్మార్వో కార్యాలయంలో నిర్వహించిన “అన్నదాత సుఖీభవ –పీఎం కిసాన్ 21వ విడత నిధుల విడుదల” కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాజువాక నియోజకవర్గంలో ఉన్న అన్నదాతలకు మొత్తం రూ. 34 లక్షల 54 వేల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పల్లా అందజేశారు. ఈ కార్యక్రమం లో గాజువాక బీజేపీ కన్వీనర్ కర్ణంరెడ్డి నర్సింగరావు, కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కోన తాతారావు, 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి రమణారెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇంచార్జ్ ములకలపల్లి ప్రకాష్, బీజేపీ మండల అధ్యక్షులు వరలక్ష్మి అనిత అప్పారావు , టీడీపీ 75వ వార్డు అధ్యక్షులు నమ్మి అప్పారావు, ప్రధాన కార్యదర్శి ములకలపల్లి పెంటయ్య అప్పలరాజు, టీడీపీ విశాఖ జిల్లా యూత్ లీడర్ మరియు డైరెక్టర్ మొల్లి పెంటరాజు సన్యాసిమ్మ, జనసేన లీడర్ ములకలపల్లి వంశీ జ్యోతి రెడ్డి, కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు

## ఎన్ని అడ్డంకులు వచ్చినా నదుల అనుసంధానం చేసి తీరుతాం: చంద్రబాబు



**కడప, పతాకం న్యూస్:** ఎన్ని సవాళ్లు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సరే, రాష్ట్రంలో నదుల అనుసంధానం పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించి తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వైఎస్సార్ కడప జిల్లాలోని కమలాపురం నియోజకవర్గం, పెండ్లిమర్రి గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ‘ప్రజావేదిక’ నుంచి ‘అన్నదాతా సుఖీభవ’ పథకంలో భాగంగా పీఎం కిసాన్ రెండో విడత నిధులను ఆయన రైతుల ఖాతాల్లోకి విడుదల చేశారు. అనంతరం జరిగిన సభలో ప్రసంగిస్తూ, రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, నీటిపారుదలపై ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. గత జనవరి 19న ‘రా కదిలి రా’ కార్యక్రమానికి కమలాపురం వచ్చినప్పుడు ప్రజలు చూపిన ఉత్సాహం అద్భుతమని గుర్తుచేసుకున్నారు. ఇప్పటికీ వారిలో అదే ఉత్సాహం కనిపిస్తోందని కొనియాడారు. కడప గడ్డపై మహానాడును విజయవంతం చేసి తెలుగుదేశం పార్టీ సత్తాను నిరూపించారని స్థానిక నేతలను, కార్యకర్తలను అభినందించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ‘సూపర్ సిక్స్’ హామీల అమలుపై కొందరు సందేహాలు వ్యక్తం చేసినా, వాటన్నింటినీ ‘సూపర్ హిట్’ చేసి చూపించామని అన్నారు. “గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ఆర్థికంగా విధ్వంసానికి గురైంది. అయినా, ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటివరకు 46.85 లక్షల మంది రైతులకు రూ.14 వేల చొప్పున వారి ఖాతాల్లో జమ చేశాం. ఇది రైతుల పట్ల మా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం” అని చంద్రబాబు తెలిపారు. వ్యవసాయ రంగంలో రైతులు ఆధునిక పద్ధతులు అలవర్చుకోవాలని సీఎం సూచించారు. “నేనూ రైతు బిడ్డనే. మా నాన్నకు పొలం పనుల్లో సాయం చేసేవాడిని. పాత పద్ధతుల్లోనే సాగు చేస్తామంటే నష్టాలు తప్పవు. డిమాండ్ ఆధారిత పంటలు పండించాలి. మన పంటలను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలి. అప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది” అని ఆయన అన్నారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన పంచసూత్రాలను పాటిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని భరోసా ఇచ్చారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకే తాను పొత్తు రాజకీయాలు చేశానని, డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి వేగవంతంగా సాగుతుందని చంద్రబాబు వివరించారు. “ఆంధ్రప్రదేశ్‌ను కరవు రహిత రాష్ట్రంగా మార్చడమే నా ఏకైక సంకల్పం. కృష్ణా, గోదావరి సహా అన్ని నదులను అనుసంధానించి, రిజర్వాయర్లను నింపగలిగితే ఒక ఏడాది వర్షాలు లేకపోయినా ఇబ్బంది ఉండదు. చెరువులు నింపాలి, భూగర్భ జలాలను పెంచాలి. భూమిని ఒక పెద్ద జలాశయంగా మార్చాలి” అని తన దార్శనికతను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనతో స్థానిక ప్రజల్లో కొత్త ఆశలు చిగురించాయి.

## ఏదో మహత్తు ఉంది: మోడీ

(మొదటిపేజీ తరువాయి)

బాబా సమూలంగా మార్చేశారని, లక్షలమందిని బాబా సేవామార్గంలో నడిపించారని ప్రధాని మోదీ అన్నారు. సత్యసాయి ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని మోదీ తెలిపారు. తాగునీరు, వైద్యం, విద్య వంటి రంగాల్లో విశిష్ట సేవలు అందించారన్నారు. 20 వేలమంది బాలికలకు ఇవాళ సురక్ష సమృద్ధి యోజన అందించారన్నారు. బాలికల ప్రగతిలో సురక్ష సమృద్ధి యోజన కీలకమైందని వివరించారు. గరీబ్ కల్యాణ్ యోజన లబ్ధిదారుల సంఖ్య వంద కోట్లకు చేరిందని, ఓకల్ ఫర్ లోకల్ నినాదంతో ముందుకెళ్లాలని ప్రధాని మోదీ సూచించారు. స్థానిక ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పుట్టపర్తి పవిత్రభూమిలో ఏదో మహత్తు ఉందని ప్రధాని మోదీ అన్నారు. ఈ భూమిపై మనకు తెలిసిన, మనం చూసిన దైవస్వరూపం సత్యసాయి అని చంద్రబాబు అన్నారు. సేవ, ప్రేమకు ప్రతిరూపం సత్యసాయిబాబా అని వివిరించారు. విశ్వశాంతి, సర్వమానవ సంక్షేమం సత్యసాయి మార్గమని కీర్తించారు. మానవసేవే మాధవసేవ అని నమ్మి సత్యసాయి ఆచరించారని, ప్రపంచమంతా ప్రేమను పంచారని సీఎం అన్నారు. తాను విదేశాలకు వెళ్తే చాలామంది సత్యసాయి గురించి చెప్పేవారన్నారు. ఆయన ఆశీస్సులతోనే తాగునీటి పథకం అందించామన్నారు. సత్యసాయి 102 విద్యాలయాలు, ఎన్నో వైద్యాలయాలు స్థాపించారన్నారు. ప్రభుత్వాల కంటే వేగంగా ఆయనే స్పందించేవారని, 1600 గ్రామాల్లో 30 లక్షల మందికి తాగునీరు అందించారని గుర్తు చేశారు. 140 దేశాల్లో 200 కేంద్రాల్లో సత్యసాయి ట్రస్ట్ సేవలందిస్తోందన్నారు. సత్యసాయి ట్రస్టుకు 7లక్షల మందికిపైగా వాలంటీర్లు ఉన్నారన్నారు. సత్యసాయి ప్రేమ సిద్ధాంతాన్ని మనమంతా అర్థం చేసుకోవాలని, సత్యసాయి చూపిన మార్గంలో మనం ముందుకెళ్లాలని వివరించారు. బాబా శతజయంత్యుత్సవాలకు కేంద్రం పూర్తిగా సహకరిస్తోందని అన్నారు. ఈ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించినట్లు చంద్రబాబు స్పష్టం చేశారు. విదేశాల్లో సత్యసాయి భక్తులను చాలా మందిని చూశానని ఆయన గొప్పతనం గురించి విదేశీయులు సైతం చెబుతారని పవన్ కల్యాణ్ అన్నారు. సత్యసాయి అత్యంత వెనకబడిన జిల్లాలో వెలిశారని తెలిపారు. సామాన్యుడికి తాగునీరు ఇవ్వాలని సత్యసాయి ఆలోచించారన్నారు. ఈ క్రమంలోనే తాగునీటి పథకానికి రూ.400 కోట్లు వెచ్చించారని స్పష్టం చేశారు. నేటి జల్‌జీవన్ మిషన్‌కు నాటి సత్యసాయి పథకమే అంకురమని పవన్ కల్యాణ్ కొనియాడారు. సత్యసాయి వేలమంది భక్తులను ప్రభావితం చేశారని, ఆయన ఇక్కడ పుట్టడం మన అదృష్టం అని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రజల్ని జడ్జ్ చేయొద్దని, వారిని అర్థం చేసుకోవాలని సత్యసాయి చెప్పారని క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ అన్నారు. దీనివల్ల చాలా సమస్యలు తొలగిపోతాయని అన్నారు. 2011 వరల్డ్‌కప్‌లో తాను ఆడినప్పుడు భావోద్వేగాలు అధికంగా ఉండేవని, అప్పుడు బెంగళూరులో ఉన్నారని తెలిపారు. సత్య సాయిబాబా తనకు ఫోన్ కాల్ చేశారని, అనంతరం ఒక పుస్తకం పంపారన్నారు. అది తనలో సానుకూల దృక్పథాన్ని, స్ఫూర్తిని నింపిందని, ఆ సంవత్సరం టీం ట్రోఫీ కూడా గెలుచుకుందన్నారు. అది తనకు గోల్డెన్ మూమెంట్ అని సచిన్ తెలిపారు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: స్పీకర్ అయ్యన్న




**నర్సీపట్నం, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా నాతవరంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం ముఖ్య ధ్యేయమని, 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని వేగంగా అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. అర్హులైన ప్రతి రైతుకు ఏటా రూ. 20,000 ఆర్థిక సాయం అందించే ఈ పథకంలో భాగంగా, రెండో విడతగా కేంద్ర ప్రభుత్వం వాటా రూ. 2,000, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 5,000 కలిపి మొత్తం రూ. 7,000ను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. గత ఆగస్టులో మొదటి విడతగా రూ. 7,000 అందజేశామని, మిగిలిన రూ. 6,000 త్వరలో విడుదలవుతాయని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 46,85,838 మంది రైతులకు ఈ ఒక్కరోజే రూ. 3,135 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. అనకాపల్లి జిల్లాలో 2,42,480 మంది రైతులకు సుమారు రూ. 158.40 కోట్లు, నర్సీపట్నం నియోజకవర్గంలో 35,040 మంది రైతులకు రూ. 23.10 కోట్లు, నాతవరం మండలంలోని 10,780 మంది రైతులకు రూ. 7.12 కోట్లు వారి ఖాతాల్లోకి చేరాయి. రైతులు అందిన పెట్టుబడి సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించిన స్పీకర్, రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు. ఇది ఆరోగ్యం, నేల సారం పరిరక్షణకు ఎంతో మేలని చెప్పారు. కార్యక్రమంలో తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ, జడ్పిటిసి సుకల రమణమ్మ, ఆర్డీవో వివి రమణ, ఏడీఏ శ్రీదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, జనసేన ఇన్‌చార్జ్ సూర్యచంద్రతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## సామాజిక బాధ్యతగా మాదకద్రవ్యాల వినియోగం అరికట్టాలి: ఎమ్మెల్యే కొణతాల



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అక్రమ రవాణా దుర్వినియోగం పై పోలీసుల శాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి బపట్టణంలోని స్థానిక రింగ్ రోడ్డు లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డి =ఐ జి ఆఫ్ పోలీస్ వినూత్న ఆలోచనతో పాయకరావుపేట నుండి ఇచ్చాపురం వరకు పోలీస్ లు ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర కార్యక్రమం ఈరోజు పట్టణ ప్రాంతానికి విచ్చేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన మాదకద్రవ్యాల వ్యతిరేకత అవగాహన సదస్సు కు మాజీ మంత్రి అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థులకు, సైకిల్ యాత్రలో పాల్గొన్న పోలీసు సిబ్బందికి అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఐదు జిల్లాలకు అవగాహన కల్పించే విధంగా ఇటువంటి మంచి కార్యక్రమం ఏర్పాటుచేసిన డీఐజీ కి అభినందన తెలుపుతూ ఇటువంటి కార్యక్రమం పోలీసు కార్యక్రమం కాకుండా సామాజిక బాధ్యత గా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డ్రగ్స్ అలవాటుకు గురు కాకుండా తల్లిదండ్రులు అలాగే తోటి విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని లేదంటే భవిష్యత్తు తరానికి ఇది చెడు వ్యసనంగా మారుతుందని అన్నారు. పిల్లలు డ్రగ్స్, మాదకద్రవ్యాల అలవాటు వల్ల తల్లిదండ్రులు రోడ్డున పడుతున్నారని ఒకరి నుంచి ఒకరు ఈ విచ్చలవిడితనం విస్తరిస్తుందని, గత ఐదు సంవత్సరాల ప్రభుత్వంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగం జరిగిందని, అధికారులకు, తల్లిదండ్రులకు, విద్యార్థులకు సామాజిక, సంయుక్తంగా, సమిష్టిగా బాధ్యతగా తీసుకుంటే మాదకద్రవ్యాల వినియోగం అరికట్టడంలో విజయవంతం అవుతుందని ఏజెన్సీలో గంజాయి సాగు విపరీతంగా జరుగుతూ ఉంటే, ఈ 16 నెలలకు కాలంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పోలీస్ శాఖ వారు అధునాతన టెక్నాలజీ ఉపయోగించి మాదకద్రవ్యాలు, గంజాయి అరికట్టే కార్యక్రమాలు విజయవంతంగా చేస్తున్నారని, ఇటువంటి కార్యక్రమాలు అవగాహనపై నియోజకవర్గంలో మండలాలలో, గ్రామాలలో, పట్టణాల్లో స్కూల్లో కాలేజీలో నందు వీటిపై వర్క్ షాప్లు సెమినార్లు జరగాలని, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు ర్యాలీలులో పాల్గొని ఫ్లా కార్డులు ప్రదర్శించి అందరికీ అవగాహన కల్పించే విధంగా మంచి కార్యక్రమం జరపాలని అన్నారు. ఈ కార్యక్రమం అనంతరం స్థానిక అనకాపల్లి బెల్లం మార్కెట్ నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు సుమారు 1000 మంది విద్యార్థులు తో పోలీసు వారి సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, డి.ఎస్.పి శ్రావణి, పోలీస్ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## షిప్ యార్డ్ కాలనీలో జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రంగోలి పోటీలు



**మల్కాపురం,పతాకం న్యూస్:** విశాఖ పశ్చిమ నియోజకవర్గం 40వ వార్డు గాంధీగ్రామ్ శాఖా గ్రంథాలయా ఆధికారి బి.కనకరాజు ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయం వారోత్సవాల్లో భాగంగా బుధవారం షిప్ యార్డ్ కాలనీలో జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రంగోలి పోటీలను నిర్వహించారు. విజేతలకు ముగింపు రోజున బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేయనున్నట్లు కనకరాజు పేర్కొన్నారు. పోటీ లకు ముందు ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సన్యాసిరావు, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

## మావోల కదిలికలపై పటిష్ఠ నిఘా

### విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి



**నర్సీపట్నం పతాకం న్యూస్:** మావోయిస్టుల కదిలికలపై నిఘాను పటష్ఠం చేసి అప్రమత్తంగా ఉన్నామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. ఇక్కడకు వచ్చిన ఆయన డీఎస్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. విజయవాడలో మాదిరిగా ఉత్తరాంధ్రలోని పట్టణ ప్రాంతాల్లో మావోయిస్టులు తలదాచుకునే అవకాశం లేదని అన్నారు. నక్సలైట్లు/ మావోయిస్టుల ప్రభావం లేకపోతే ఏజెన్సీ ప్రాంతం మరింత అభివృద్ధిచెంది వుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. సైబర్ మోసాల విషయంలో ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని అని ఎవరైనా చెబితే నమ్మవద్దని అన్నారు. డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ నేరాలుకు పాల్పడుతున్నారని, అటువంటి ఫోన్ కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు, సైబర్ నేరాల టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని డీఐజీ సూచించారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితులకు సంబంధించి 14 మందికి చెందిన ఆస్తులను సీజ్‌చేసినట్టు చెప్పారు. గంజాయి రవాణా కట్టడి కోసం ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు, ఇన్‌ఫార్మర్లు, డ్రోన్లు సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. ఆయన వెంట ఎస్పీ తుహిన్‌సిన్హా, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు, ఎస్‌ఐలు వున్నారు.


## ఘనంగా జాప్ 33వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు






**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్ ) 33వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పలువురికి మరియు సిబ్బందికి రొట్టెలు,పళ్ళు జాప్ ఫౌండర్ ఉప్పల్ లక్ష్మణ్,రాష్ట్ర అధ్యక్షులు రవితేజ ఆదేశాల మేరకు ఈకార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్డెంట్ కృష్ణారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ తాడి రామకృష్ణ మరియు అధ్యక్షులు డాడీ వెంకట్రావు కార్యదర్శి ఎన్.అజయ్ ప్రసాద్ కార్యవర్గ సభ్యులు వివిధ వర్గాల వారు పాల్గొన్నారు.

## రైతులు ఖాతాల్లో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నగదు జమ



**బుచ్చయ్యపేట, పతాకం న్యూస్:** మండలంలో కొండేంపూడి కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమన్ని నిర్వహించారు. అలాగే ఈ రోజు ఈ పథకం ద్వారా రైతులకు రూ. 7 వేలు అన్నదాత, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ పథకం నగదు జమ రైతులు ఖాతాల్లో చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ముఖ్య ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ డా.ఎస్. రాజ్ కుమార్, రైతులు ఖాతాల్లో జమ చేసిన నగదు వ్యవసాయం కొరకు ఉపయోగించుకోవాలని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కోయంబత్తూర్లో అతిధ్యం స్వకరించి, దక్షిణ భారత ప్రకృతి వ్యవసాంపం గురించి చర్చించడం జరిగింది. అలాగా రైతు అందరూ ప్రకృతి వ్యవసాయ గురించి తెలుసుకోని ప్రారంభించవలసిందిగా కోరారు.

### శారదా నదిలో ఇసుక తవ్వకాలు, విక్రయాల కోసం గ్రామాల్లో

## అనధికారికంగా వేలం పాటలు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** మొంథా తుఫాన్ సమయంలో కురిసిన భారీ వర్షాలతో మండలంలోని పలుచోట్ల శారదా నదిలో భారీ మొత్తంలో ఇసుక మేటలు వేసింది. ఇదే అదనుగా భావించిన గ్రామస్థాయి నాయకులు.. పార్టీలకు అతీతంగా ఇసుక తవ్వకాల కోసం వేలం పాటలు నిర్వహిస్తున్నారు. మండలంలో తామరబ్బ, సమ్మెద, చింతలపూడి, దేవరాపల్లి, తెనుగుపూడి, వెంకటరాజపురం, తిమిరాం, మామిడిపల్లి, వేచలం, కలిగొట్ల, బి.కింతాడ గ్రామాల పరిధిలో శారదా నదిలో పలుచోట్ల ఇసుక మేటలు వేసింది. కానీ మండలంలో ఎక్కడా అధికారికంగా ఇసుక రీచ్‌లు లేదు. అయితే స్థానికంగా ఇళ్లు, ఇతర నిర్మాణాల నిమిత్తం ముందస్తు అనుమతితో నదుల్లో నుంచి నిర్ణీత పరిమాణంలో ఇసుక తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. దీనిని గ్రామాల్లో కొంతమంది నాయకులు తమకు అనుకూలంగా మార్చుకుని దర్జాగా ఇసుక వ్యాపారం సాగిస్తున్నారు. ఇందుకోసం శారదా నదిలో వున్న ఇసుక నిల్వలు, రవాణా సదుపాయం, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని వేలం పాటలు నిర్వహిస్తున్నారు. తెనుగుపూడి వద్ద నదిలో ఏడాదిపాటు ఇసుక తవ్వకాల కోసం రూ.30 లక్షలకు వేలం పాట పాడినట్టు తెలిసింది. రాజకీయంగా ప్రత్యర్థులుగా వున్న నేతలు.. ఇసుక విషయానికి వచ్చేసరికి ఒక్కటవుతున్నారు. శారదా నదిలో చింతలపూడి, తామరబ్బ గ్రామాల పరిధిలో ఇసుక తవ్వి, విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలోని గ్రామాలకు రవాణా చేస్తున్నారు. తెనుగుపూడి నుంచి ఇదే జిల్లా వేపాడ, ఎల్.కోట, కొత్తవలస మండలాలకు సరఫరా చేస్తున్నారు. ఇక రైవాడ రిజర్వాయర్‌కు ఎగువున వున్న అనంతగిరి మండల పరిధిలో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. నది నుంచి ఉన్న దూరాన్నిబట్టి ట్రాక్టర్ ఇసుక రూ.3 వేల నుంచి రూ.6 వేల వరకు విక్రయిస్తున్నారు.

## శానిటరీ సిబ్బందికి దుస్తులు పంపిణీ




**గోపాలపట్నం, పతాకం న్యూస్:** విశాఖ పశ్చిమ నియోజకవర్గం 62వ వార్డ్ జీవీఎంసీ వార్డ్ ఆఫీస్ వద్ద జీవీఎంసీ వర్కర్స్ మరియు సూపర్ వైజర్స్‌కి, మహిళలకు మూడు చీరలు, బ్లౌజ్,3టవల్స్, మగవాళ్ళకి 7 మీటర్లు తాను, 3టవల్స్, జీవీఎంసీ ఆధ్వర్యంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గం శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్ నాయుడు గణబాబు ఆదేశాలు మేరకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మజ్జి మాలి నాయుడు చేతుల మీదుగా జీవీఎంసీ వర్కర్స్ కు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ నవరత్నం, సూపర్‌వైజర్ గోవింద్, సానిటరీ సెక్రటరీ జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు

## గొలుగొండలో ముమ్మరంగా వాహనాల తనిఖీ



**గొలుగొండ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలో రోడ్డు భద్రతను పటిష్ఠం చేసేందుకు గొలుగొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి. రామారావు ఆదేశాల మేరకు బుధవారం ఉదయం నుంచి ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు.ఏఎస్ఐ రామారావు నేతృత్వంలో చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీల్లో ప్రధానంగా ద్విచక్రవాహనాల రికార్డులు,లైసెన్స్,ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్‌లను పరిశీలించారు. అనేక మంది రైడర్లు హెల్మెట్ ధరించకపోవడం, కొందరు కారు డ్రైవర్లు సీట్‌బెల్ట్ లేకుండా ప్రయాణించడం గుర్తించారు.వాహనదారులతో మాట్లాడిన పోలీసు అధికారులు ప్రాణాలు కాపాడుకోవాలంటే హెల్మెట్,సీట్‌బెల్ట్ తప్పనిసరి అని,రికార్డులు సక్రమంగా ఉంచుకోకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన కొందరిపై స్పాట్ చలాన్లు విధించినట్లు అధికారులు తెలిపారు.రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ఇలాంటి తనిఖీలు రోజూ కొనసాగుతాయని ఎస్ఐ రామారావు పేర్కొన్నారు.

## గొలుగొండలో 58వ జాతీయ గ్రంథాలయ ఘనంగా వారోత్సవాలు



**గొలుగొండ, పతాకం న్యూస్:** దేశంలోని మొదటి మహిళా ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ జన్మదినం సందర్భంగా గొలుగొండ శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ మేరకు మంగళవారం ఉదయం గ్రంథాలయాధికారిణి ఎస్.వరలక్ష్మి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి,దీపం వెలిగించి నివాళులర్పించారు. అనంతరం స్థానిక పాఠశాల బాలికలకు రంగవల్లికల పోటీని ఆకర్షణీయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు,విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు వివిధ సాంస్కృతిక,సాహిత్య కార్యక్రమాలు కొనసాగనున్నట్లు గ్రంథాలయ అధికారులు తెలిపారు.

## నేడు సీబీఐ ప్రత్యేక కోర్టుకు జగన్



**హైదరాబాద్, పతాకం న్యూస్:** అక్రమాస్తుల కేసులో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు ముందు హాజరు కానున్నారు. సుదీర్ఘ కాలంగా బెయిల్‌పైనే ఉన్న ఆయన ఇటీవల కోర్టు ఆదేశాలతో న్యాయస్థానం మెట్లు ఎక్కనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో 2020, జనవరి 10న విచారణకు హాజరయ్యారు. ఆ తర్వాత 'అధికార హోదా'ను అడ్డుపెట్టుకుని ఇప్పటి వరకు కోర్టుకు వెళ్లకుండా తప్పించుకున్నారు. ముఖ్యమంత్రిగా తనకు భద్రత అవసరమని.. పాలనా బాధ్యతల నేపథ్యంలో తాను కోర్టుకు హాజరు కాలేనంటూ అపట్లో పిటిషన్ దాఖలు చేసి సీబీఐ ప్రత్యేక కోర్టు నుంచి అనుమతి పొందారు. 2024, సార్వత్రిక ఎన్నికల తర్వాత కూడా సీబీఐ ప్రత్యేక కోర్టు ముందు హాజరుకాకుండా వాయిదాలు వేయించుకునే ప్రయత్నాలు చేశారు. అయితే.. జగన్ లండన్ వెళ్లిన సమయంలో ఫోన్ నంబరు తప్పుగా ఇవ్వడంతో.. జగన్ కోర్టుకు హాజరు కావాల్సిందేనంటూ అక్రమాస్తుల కేసును విచారిస్తున్న సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. గతంలో సీఎం హోదాలో ఉన్నానని.. తనకు భద్రత అవసరమంటూ జగన్ సాకులు చెబుతూ వచ్చారు. ప్రస్తుతం ప్రతిపక్షనేత హోదా లేదు. వైసీపీ అధ్యక్షుడిగా ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆందోళనలు చేపడుతున్నారు. ఈ క్రమంలో న్యాయస్థానం ముందు హాజరు నుంచి తప్పించుకునేందుకు ఎలాంటి సాకులూ చూపలేని పరిస్థితి ఎదురైంది. కోర్టు కూడా ఈ నెల 21లోగా విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

## ఏసీబీ కోర్టు ముందు లొంగిపోవాలంటూ మద్యం స్కాం నిందితులకు హైకోర్టు ఆదేశం




**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీలోని మద్యం కుంభకోణం కేసులో రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డితోపాటు బాలాజీ గోవిందప్పలకు డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేస్తూ ఏసీబీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని సీఐడీ వేసిన పిటిషన్‌ను బుధవారం ఏపీ హైకోర్టు విచారించింది. అందుకు పాక్షికంగా హైకోర్టు అనుమతించింది. నవంబర్ 26వ తేదీలోగా ఏసీబీ కోర్టు ముందు సరెండర్ కావాలని వారికి స్పష్టం చేసింది. రెగ్యులర్ బెయిల్ దాఖలు చేసుకొనేందుకు వారికి అనుమతి ఇచ్చింది. ప్రస్తుత ఉత్తర్వులతో సంబంధం లేకుండా మెరిట్స్ ఆధారంగా బెయిల్ పిటిషన్లపై విచారణ జరపాలని ఏసీబీ కోర్టుకు ఏపీ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో విచారణ జరపాలని ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు రూ. 3500 కోట్ల మేర మద్యం కుంభకోణం జరిగినట్లు ఈ దర్యాప్తులో తెలింది. ఈ స్కాంలో భారీగా అరెస్టులు జరిగాయి. ఈ స్కాంలో భారీగా నగదు పొందిన కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి.. హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో ఆస్తులు కూడబెట్టాడు. వాటిని సైతం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఇక ఈ విచారణలో అతడు వెల్లడించిన అంశాలు ఆధారంగా పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో ఏ 31గా ధనుంజయ్ రెడ్డి, ఏ 32గా కృష్ణమోహన్ రెడ్డితోపాటు ఏ 33గా బాలాజీ గోవిందప్ప ఉన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ మొదటి వారంలో ఈ ముగ్గురికి ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఏసీబీ కోర్టు జారీ చేసిన ఆ ఉత్తర్వులను రద్దు చేయాలంటూ ఏపీ హైకోర్టులో సీఐడీ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది.

## సౌదీ మృతుల కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక విమానం ఏర్పాటు చేయాలి: కవిత



**హైదరాబాద్, పతాకం న్యూస్:** సౌదీ అరేబియాలో జరిగిన దురదృష్టకర ఘటనలో మరణించిన వారి కుటుంబాలను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈరోజు పరామర్శించారు. హైదరాబాద్ జిర్రా నటరాజ్ నగర్‌లోని బాధితుల ఇళ్లకు వెళ్లి, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కష్టకాలంలో వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, సౌదీ ఘటన అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణమే స్పందించి, బాధితుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. మృతుల కుటుంబ సభ్యులు సౌదీ అరేబియాకు వెళ్లాల్సిన అవసరం ఉన్నందున, వారి కోసం ప్రభుత్వం ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.

అంతేకాకుండా, ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా సహాయాన్ని వీలైనంత త్వరగా బాధితుల కుటుంబాలకు అందజేయాలని కవిత విజ్ఞప్తి చేశారు. బాధితులకు అవసరమైన సహాయం అందించడంలో ఎలాంటి జాప్యం జరగకూడదని ఆమె అన్నారు.

## ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళల అవగాహన సదస్సు




**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం శాఖ గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి పురస్కరించుకొని "దేశాభివృద్ధిలో మహిళల పాత్ర" అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి పి. దమయంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రూరల్ సీఐ రేవతమ్మ ముఖ్య అతిథిగా హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు.

అనంతరం ఆమె ఇందిరాగాంధీ జీవితం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీ.వీ. పద్మావతి మహిళ అభివృద్ధి సమాజాభివృద్ధికి పునాది అని చెప్పారు. బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.శోభ ఇందిరాగాంధీ స్త్రీశక్తికి ప్రతీక అని గుర్తుచేశారు. జెడ్పీ హైస్కూల్ హిందీ ఉపాధ్యాయిని ఎం.రాఘవకుమారి రాజ్యాంగం మహిళల అభివృద్ధికి అనేక అవకాశాలు కల్పించిన విషయాన్ని వివరించారు. మహిళా కానిస్టేబుల్ భవాని సామాజిక మాధ్యమాలను సద్వినియోగం చేసుకొని ముందుకు రావాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న కుమారి కావ్య స్త్రీశక్తి సమాజాభివృద్ధిలో కీలకమని ఉదాహరణలతో తెలిపింది. కార్యక్రమం అనంతరం దమయంతి దంపతులు అతిథులను సన్మానించారు. మధ్యాహ్నం జూనియర్ కళాశాల విద్యార్థినులకు రంగవల్లి పోటీ నిర్వహించారు.

## ఎట్టకేలకు కణితి రోడ్డు పార్కింగ్‌కు మోక్షం

### ట్రాఫిక్ పోలీస్‌లపై ప్రశంసలు వెల్లువ



**గాజువాక, పతాకం న్యూస్:** ప్రజలకు వాహనదారులకు దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న గాజువాక కణితి రోడ్డు పార్కింగ్ కు ట్రాఫిక్ పోలీస్ ల సహకారంతో మోక్షం కలిగింది. జీవీఎంసీ 66 వ వార్డు బీసీ రోడ్డు నుండి కణితి రోడ్డు మార్కెట్ మొదలకుని మసీద్ వరకు వెళ్లాలంటే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం కలిగి ప్రజలు, వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. కణితి రోడ్ లో వ్యాపారాలు చేసుకునే వారి వద్దకు వచ్చే కొనుగోలుదారులు రోడ్డుపై వాహనాలు నిలపడం, అలాగే ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలుపుదల, మరి కొంతమంది అయితే చిరు వ్యాపారులు రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు చేయడంతో ప్రజలు, వాహన చోదకులు అనేక ఇబ్బందులు పడుతుండేవారు. ఇక ఏదైనా ముఖ్యమైన పండగలు వస్తే ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారుతుంది. ఇటువంటి సమయంలో జీవీఎంసీ సిబ్బంది వచ్చి తూతూ మంత్రంగా నాలుగైదు వాహనాలకు కేసులు రాయడం నాలుగైదు షాపులకు కేసుల రాయడం చేసి చేతులు దులుపుకొని వెళ్ళిపోతున్నారు. ప్రభుత్వాలు మారిన అధికారులు మారిన మారని కణితి రోడ్డు పార్కింగ్ సమస్యకు గాజువాక ట్రాఫిక్ సిఐ గా విధులు నిర్వహిస్తున్న షేక్ హుస్సేన్ పర్యవేక్షణ లో ట్రాఫిక్ ఎస్ ఐ కె శాంతారామ్ తన సిబ్బంది తో కలిసి వాహనదారులకు, ప్రజలకు వ్యాపారవేత్తలకు రోడ్డుపై చిరు వ్యాపారులు చేసే వారికి అవగాహన కల్పించి బీసీ రోడ్డు నుండి కణితి రోడ్డు మసీద్ వరకు రోడ్డు సెంట్రింగ్ లో పార్కింగ్ చేసి పార్కింగ్ కష్టాలకు తెరదించారు. ట్రాఫిక్ కు, పార్కింగ్ సమస్యకు పరిస్కారం చూపిన ట్రాఫిక్ పోలీస్ కు వాహనదారులు, ప్రజలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజశేఖర్, వెంకటేష్, శ్రీకాంత్, నాయుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఎన్నో ఏళ్లుగా కణితి రోడ్డు ట్రాఫిక్ సమస్య, పార్కింగ్ సమస్య కు సెంటర్ పార్కింగ్ ఏర్పాటు చేసి పరిస్కారం చూపిన ట్రాఫిక్ సిఐ షేక్ హుస్సేన్, ఎస్సై కె శాంతారామ్ ఇతర సిబ్బంది కీ చిరు వ్యాపారుల సంఘం, గాజువాక ప్రజలందరి తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామని చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షులు వెంకటరెడ్డి తెలిపారు. వాహనాల పార్కింగ్ సమస్యను తెలుసుకొని సెంటర్ పార్కింగ్ ద్వారా పరిష్కారం చూపడం చాలా సంతోషంగా ఉందన్నారు. పోలీసు వారు తీసుకున్న ఈ నిర్ణయానికి తమ సంఘం తరఫున అలాగే మార్కెట్లో ఉన్న ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించి వాహన పార్కింగ్ సమస్యకు నాంది పలుకుదాం అన్నారు. ఈ కార్యక్రమంలో ముత్త అప్పారావు, సంఘ కార్యదర్శి ఆవాల శివ, శ్రీను, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడులు ఆకర్షించాం: లోకేశ్

(మొదటిపేజీ తరువాయి)

15 బిలియన్ డాలర్లతో ఏపీలో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. అదేవిధంగా, ఉక్కు దిగ్గజం ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ దాదాపు 17 బిలియన్ డాలర్ల పెట్టుబడితో భారీ స్టీల్ ప్లాంట్‌ను నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. అదానీ గ్రూప్ సైతం ఇప్పటికే రాష్ట్రంలో 5 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టగా, రాబోయే పదేళ్లలో మరో 12 బిలియన్ డాలర్లను పోర్టులు, సిమెంట్, డేటా సెంటర్లు, ఇంధన రంగాల్లో పెట్టుబడిగా పెట్టనున్నట్లు ప్రకటించింది. "మీ 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నినాదం కేవలం మాటలకే పరిమితం కాలేదు. మాలాంటి పెట్టుబడిదారులకు అది ప్రత్యక్ష అనుభవం" అని అదానీ గ్రూప్ అధినేత కరణ్ అదానీ స్వయంగా ప్రశంసించడం విశేషం. భారత్‌లో డేటా సెంటర్ కోసం గూగుల్ స్థలాన్ని అన్వేషిస్తోందని తెలియగానే లోకేశ్, ఆయన యువ అధికారుల బృందం రంగంలోకి దిగింది. పన్ను విధానాలు, డేటా భద్రత వంటి అంశాలపై గూగుల్ లేవనెత్తిన సందేహాలను కేంద్ర ప్రభుత్వ పెద్దలతో చర్చించి, స్పష్టమైన హామీలు ఇప్పించారు. దీంతో నెలల వ్యవధిలోనే గూగుల్ ఒప్పందం ఖరారైంది. అదేవిధంగా, ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం పొరుగు రాష్ట్రం నుంచి ముడి ఖనిజాన్ని తరలించేందుకు అవసరమైన 200 కిలోమీటర్ల స్లర్రీ పైప్‌లైన్‌కు ప్రధాని మోదీ నుంచి తక్షణమే అనుమతులు సాధించారు. "కేంద్ర ప్రభుత్వంలో మాకు బలమైన గొంతు ఉంది. దానివల్లే వేగంగా పనులు జరుగుతున్నాయి" అని లోకేశ్ చెబుతున్నారు. ఈ దూకుడుతో 2029 నాటికి రాష్ట్రానికి 1 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులను సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. అయితే, ఏపీ దూకుడుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పొరుగున ఉన్న కర్ణాటక, గూగుల్ డేటా సెంటర్‌ను తాము కోల్పోవడానికి కారణం ఏపీ ప్రభుత్వం విద్యుత్, నీరు, భూమి వంటివాటిపై భారీ రాయితీలు ఇవ్వడమేనని ఆరోపించింది. దీనిపై లోకేశ్ తనదైన శైలిలో స్పందిస్తూ, "ఆంధ్రా భోజనం కారంగా ఉంటుందంటారు. మా పెట్టుబడులు కూడా అలాగే ఉన్నట్లున్నాయి. కొందరు పొరుగువారికి ఆ సెగ అప్పుడే తగులుతోంది!" అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ మేరకు రాయిటర్స్ తన కథనంలో ఈ వివరాలను వెల్లడించింది.

## మాదకద్రవ్యాల వ్యతిరేక సైకిల్ ర్యాలీ.. లంకెలపాలెం జంక్షన్‌లో అవగాహన కార్యక్రమం



**పరవాడ, పతాకం న్యూస్:** మాదకద్రవ్యాల నిర్మూలన కోసం నిర్వహిస్తున్న యాంటీ-డ్రగ్స్ సైకిల్ ర్యాలీలో భాగంగా బుధవారం లంకెలపాలెం జంక్షన్ వద్ద విశాల స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. కార్యక్రమం ప్రారంభంలో పరవాడ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్ ప్రసంగిస్తూ యువత డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఈ వ్యసనాలు జీవితాన్ని నాశనం చేసే ప్రమాదం ఉందని, ఆరోగ్యకరమైన జీవనశైలితో ముందుకు సాగాలని యువతను ప్రేరేపించారు. డీఎస్పీ స్వయంగా మొత్తం 25 మంది సైక్లిస్టులతో కలిసి సుమారు 7 కిలోమీటర్ల దూరం సైకిల్ తొక్కి, పాల్గొన్నవారిలో అపార ఉత్సాహం నింపారు. డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో ప్రతి యువకుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పరవాడ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎం.వినోద్ బాబు, జెట్టి సుబ్బారావు, సెక్రటరీ, ఎన్. సూర్య ప్రకాశరావు, లంకెలపాలెం జడ్.పి.హెచ్ స్కూల్ హెచ్.ఎం. ఆర్.నాగేశ్వరరావు,మురళీ పట్నాయక్ పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా, గొన్నా కాలేజ్ కరస్పాండెంట్ హేమచంద్ర తన కాలేజ్ విద్యార్థులతో కలిసి డ్రగ్స్ వ్యతిరేకంగా రెండు ఆకట్టుకునే స్కిట్స్ ప్రదర్శించారు. మాదకద్రవ్యాల వినాశకర ప్రభావాలను అద్భుతంగా ప్రతిబింబించారు. అదనంగా నిస్ట్ కాలేజ్ విద్యార్థులు, లంకెలపాలెం హైస్కూల్ విద్యార్థులు కూడా పాల్గొని కార్యక్రమానికి మరింత ప్రాధాన్యతను తీసుకువచ్చారు.

## మండలంలో ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**రాజవొమ్మంగి, పతాకం న్యూస్:** రాజవొమ్మంగి మండలంలో ధాన్యం కొనుగోలు బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు రాజవొమ్మంగి మండలం సహకార పరపతి సంఘం (సొసైటీ) చైర్మన్ ముప్పన కేశవ్ తెలిపారు. అందులో భాగంగా బుధవారం సొసైటీ కార్యాలయం గిడ్డంగి కేంద్రం వద్ద ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజవొమ్మంగి మండలంలో శరభవరం, జడ్డంగి, లబ్బర్తి, వాతంగి, దూసరపాము, రాజవొమ్మంగి లలో కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ధాన్యం మొదటి రకం వంద కేజీలు 2389 రూపాయలు, సాధారణ రకం వంద కేజీలు 2369 రూపాయలు గా గవర్నమెంట్ రేటు నిర్ణయించినట్లు తెలిపారు, అలాగే మొదటి రకం 75కేజీలు 1792, రూ. సాధారణ రకం 75కేజీలు1,777 రూ లని తెలిపారు. రైతులు ధాన్యం అమ్మిన 24గం.లలోనే తమ ఎకౌంటులో నేరుగా సొమ్ములు జమ అవుతుందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని తెలిపారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు ముప్పన సావిత్రి, చీడిపల్లి అప్పారావు, కనిగిరి వీరబాబు, షేక్ బాబ్జీ, కనిగిరి దుర్గా ప్రసాద్, మాకిరెడ్డి లోవరాజు, బొదిరెడ్డి త్రిమూర్తులు, లోకేష్, నాగులాపల్లి కుశరాజు, గొల్లపల్లి ముసిలి, సొసైటీ సిబ్బంది, ధాన్యం కొనుగోలు సిబ్బంది, సచివాలయం అగ్రికల్చర్ సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

## ఆక్యుపంక్చర్ వైద్యంపై అవగాహన




**జీకేవీధి, పతాకం న్యూస్:** యూనియన్ ఆఫ్ ఆక్యుపంక్చర్ ఆల్టర్నేటివ్ మెడిసిన్స్, ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో 33వ ఆవిర్భావ దినోత్సవ వేడు కలను పురస్కరించుకుని జి. కె. వీధి (మండలం) పరిధిలోని ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆర్. వి. నగర్ వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో నాడీ వైద్యాన్ని (ఆక్యుపంక్చర్) గురించి మరింత అవగాహన కల్పించడానికి, ఈ ప్రాచీన వైద్య విధానం యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆక్యుపంక్చర్ అనేది ఎలాంటి దుష్ప్రభావాలు (సైడ్ ఎఫెక్ట్స్) లేకుండా అనేక దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే సమర్థవంతమైన వైద్య విధానమని పేర్కొన్నారు.

## రైతులపై వరి కోతల భారం



**రాజోలు, పతాకం న్యూస్:** అన్నదాతలకు మరో కష్టం వచ్చిపడింది. ప్రకృతి విపత్తులు ఈసారి వరి రైతులను బాగా దెబ్బతీశాయి. చేతికి వచ్చిన పంట ఇంటికి వచ్చే పరిస్థితి లేకుండా పోతోంది. వరి కోతల విషయంలోనూ ఈసారి ఎప్పుడూ లేనంత కష్టం వచ్చింది. వరదకు పొలాల్లో నీరు చేరడం, తేమ ఇప్పటికీ ఆరకపోవడం, చేను ఒరిగిపోవడంతో వడ్లు అలాగే ఉంటే మొలకెత్తే పరిస్థితి ఉంది. ప్రతిసారీ టైర్ల మెషిన్లతో కోతలు పూర్తయ్యేవి. ఎక్కడో బాగా తేమ ఉండే ప్రాంతాల్లోనే వరి కోతలకు చైన్ ట్రాక్ మెషిన్లు అవసరమయ్యేవి. వరుస వానలతో ఈసారి పంట పొలాల్లో నీరు ఇంకా నిలిచే ఉంది. కొన్ని ప్రాంతాల్లో వారంలోపు కచ్చితంగా వరి కోతలు పూర్తి చేయాల్సిన పరిస్థితి ఉంది. వరి విస్తీర్ణానికి అవసరమైన చైన్ ట్రాక్ మెషిన్లు లేకపోవడంతో కోతలకు ఇబ్బంది కలుగుతోంది. ప్రతి ఊర్లోనూ ఇప్పుడు వరి కోత మెషిన్లకు బాగా డిమాండ్ ఉన్నది. చైన్ ట్రాక్ మెషిన్ల యజమానుల దగ్గరికి రైతులు వెళ్లి బతిమాలుతున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వడ్లు మొలకలు వచ్చే పరిస్థితి ఉండడంతో ట్రాక్ మెషిన్లకు డిమాండ్ పెరిగింది. ఇదే ఇప్పుడు రైతులకు మరిత భారంగా మారింది. వరి కోతల ఖర్చులు ఇప్పుడు రెట్టింపు అవుతోంది. కింద పడిన వరిని కోత కోయడానికి సమయం ఎక్కువ పడుతుంది. ఎకరాకు కనీసం గంటన్నర కన్నా ఎక్కువ సమయం పడుతుంది. ఈ లెక్కన ఎకరాకు రూ.5,000 నుంచి రూ.5,500 వరకు ఖర్చువుతోందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా చైన్ ట్రాక్ మెషిన్లకు డిమాండ్ వచ్చింది. ఇదే అదునుగా వాటి యజమానులు వరి కోతల ఛార్జీలను పెంచారు. గతంలో గంటకు ధర రూ.2,200 నుంచి రూ.2,500 ఉండగా, ఇప్పుడు ఏకంగా రూ.3,500 నుంచి రూ.4,500 వరకు పెంచేశారు. నేలవాలిన ఎకరం వరి కోతకు రూ.7 వేల నుంచి రూ.8 వేలు అవుతోంది. చైన్ ట్రాక్ మిషిన్ల కొరతతో ఈసారి వరి కోతలు నెలల తరబడి కొనసాగే పరిస్థితి ఉంది. కొనుగోలు కేంద్రాలకు వడ్లు ఆలస్యంగా వస్తున్నాయి. కోతల సమయంలో వచ్చిన వానలకు వడ్లు తడపడంతో నూకలు ఎక్కువ అయ్యే పరిస్థితి ఉంది. గిట్టుబాటు ధర వస్తుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా ముమ్మిడివరం మండలంలో టైర్ మెషిన్ గంటకు రూ.1,700 తీసుకుంటే, చైన్ మెషిన్‌కు రూ.3,500 తీసుకుంటున్నారు. ఎకరం పొలం కోసేందుకు రైతులు రూ.7 వేలకు పైగా ఖర్చవుతుందని వాపోతున్నారు.

## ఎస్సీ వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్లు



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో మంచినీటికి కూడా దిక్కులేని దయనీయ పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. విద్యార్థులకు రక్షిత మంచినీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించింది. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాలల్లో ఆర్ఒ ప్లాంట్ల ఏర్పాటు చేసి రక్షిత మంచినీరు అందించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఆ శాఖ కార్యదర్శి ఎం.ఎం నాయక్ ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 311 వసతి గృహాల్లో ఒక్కో ఆర్ఒ ప్లాంట్‌కు రూ.2 లక్షల వ్యయం చొప్పున మొత్తం రూ.6.22 కోట్లను ఇందుకు కేటాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 49 ఎపిఎస్ఆర్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ సంస్థల్లోను, రెండు ఎపి స్టడీ సర్కిళ్లలోను రూ.6 లక్షల రూపాయల విలువైన ఆర్ఒ ప్లాట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ ఆర్ఒ ప్లాంట్ల ఏర్పాటు పనులను 45 రోజుల్లోగా పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో వెల్లడించారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎపి ఎస్‌సి కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్, మైనేజింగ్ డైరెక్టర్‌కు సూచించింది.

## రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన పెద్దాపురం విద్యార్థులు



**కర్నూలు, పతాకం న్యూస్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18 వ తేదీన కాకినాడలోని డిఎస్ ఏ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పెద్దాపురం మండల పరిధిలోని ఆర్ బి కొత్తూరు, కట్టమూరు జిల్లా పరిషత్ హై స్కూల్స్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 17 బాయ్స్, గర్ల్స్ విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో ఆర్ బి కొత్తూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు పంపన వినరు (10 వ తరగతి) హేమర్ త్రో లో ప్రథమ స్థానం సాధించగా డిస్కస్ త్రో లో తృతీయ స్థానం సాధించాడు. ఈసారపు రమణ (10 వ తరగతి) హేమర్ త్రో లో ద్వితీయ స్థానం సాధించాడు. అలాగే కట్టమూరు జడ్పీ హై స్కూల్ విద్యార్థిని పి శ్రీలక్ష్మి అండర్ 17 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయింది. ఈ విద్యార్థులు ఈ నెల 21 నుండి 23వ తేదీ వరకు కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా వీరిని కట్టమూరు జడ్పీ హైస్కూల్ హెచ్ ఎం మీనా మాధురి, ఆర్ బి కొత్తూరు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సత్యవాణి, ఉపాధ్యాయులు నిత్యానందం, కృష్ణమూర్తి, పిడి కామిరెడ్డి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు,గ్రామ పెద్దలు అభినందించారు.

# 'ఉక్కు'ను తుక్కు చేసే కుట్రలు

- **ఉద్యోగులను తొలగిస్తూ ప్రైవేటీకరణ ప్రయత్నాలు తీవ్రతరం**
- **ప్యాకేజీని అప్పులకు జమ చేసి సాయం చేసినట్టు బిల్డప్**
- **రాష్ట్ర ప్రాజెక్టులకు సైతం రాయపూర్ ఉక్కు వినియోగం**



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' నినాదంతో త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారంపైనా, అందులో పనిచేస్తున్న కార్మికులపైనా నాలుగున్నరేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలు కొనసాగుతూనే ఉన్నాయి. ఉక్కును తుక్కు చేసి కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టే కుయుక్తులు ముమ్మరమయ్యాయి. స్టీల్‌ప్లాంట్‌పైనా, కార్మికులపైనా ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సిఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు సందర్భంగా అనుచిత వ్యాఖ్యలు చేశారు. అవాస్తవాలు మాట్లాడారు. వాస్తవానికి రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక స్టీల్‌ప్లాంట్‌లో పెద్ద ఎత్తున కార్మికులను తొలగించబడ్డారు. ప్యాకేజీ పేరుతో ఇచ్చిన డబ్బంతా బ్యాంకులకు పన్ను బకాయిలుగా కేంద్ర బొక్కసానికి జమకట్టి ప్రైవేటీకరణ చర్యలు వేగవంతం చేయబడ్డాయి. కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీలో ఇంకా రూ.800 కోట్లు చెల్లించాల్సి ఉంది. వచ్చిన డబ్బంతా బ్యాంకుల అప్పులకు, పన్నులకు జమ చేయాలనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను స్టీల్ యాజమాన్యం అమలు చేసింది. ఉత్పత్తికి కానీ, ప్లాంట్‌లో మరమ్మతులకు కానీ, వేతన బకాయిలకు కానీ ఒక్క పైసా కూడా వెచ్చించలేదు. ప్రైవేటీకరణ నిర్ణయం ప్రకటించే నాటికి అంటే, 2021 జనవరి 27కు ప్లాంట్ రూ.916 కోట్ల లాభాల్లో ఉంది. గడిచిన నాలుగేళ్లలో రూ.10 వేల కోట్ల నష్టం వచ్చింది. కావాలనే నష్టాల పాలు చేసి తాము ఆదుకున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు పోతున్నాయి. 2,020 నాటికి విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం 7.3 మిలియన్ టన్నులు. పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు కలిపి 28 వేల మంది వరకూ ఉండేవారు. ప్రైవేటీకరణ నిర్ణయం తర్వాత కార్మికుల సంఖ్య 20 వేలకులోపునకు వచ్చేసిందని కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు. అప్పట్లో రా మెటీరియల్ నాణ్యంగా వచ్చేది. ఇప్పుడు నాసిరకమైన రా మెటీరియల్ వస్తోందని అంటున్నారు. సొంత గనులూ లేవు. ఆరేళ్లుగా కార్మికుల రిక్రూట్‌మెంట్ జరగలేదు. ఈ కారణాలన్నింటితో విశాఖ ఉక్కు నష్టాలబారిన పడుతోంది. నాగర్‌నార్ స్టీల్‌ప్లాంట్, బిపిసిఎల్ వంటి పరిశ్రమల ప్రైవేటీకరణను కేంద్రం ఉపసంహరించు కున్నట్లు పార్లమెంట్‌లో ప్రకటించింది. దీపం వెబ్‌సైట్ నుంచీ ఆ సంస్థలను తొలగించింది. అక్కడి కార్మికుల, రాష్ట్ర ప్రభుత్వాల ఒత్తిడి మూలంగా ప్రైవేటీకరణ చర్యలు ఆగాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో మాత్రం అలా జరగడం లేదు. గత వైసిపి, ప్రస్తుత టిడిపి ప్రభుత్వాలు కేంద్రంలోని మోడీ సర్కారుతో అంటకాగుతూ ఉక్కు పరిశ్రమను నిర్వీర్యం చేశాయి.

ప్యాకేజీ ఇచ్చామని చంద్రబాబు పదేపదే చెబుతున్నా టిడిపి కూటమి వచ్చాక 28 వేల మంది కార్మికుల్లో 1,600 మంది పర్మినెంట్ ఉద్యోగులను విఆర్ఎస్ ఇచ్చి ఇంటికి పంపించేశారు. 5,500 మంది కాంట్రాక్టు కార్మికులను అడ్డగోలుగా (ఫైనల్ సెటిల్‌మెంట్ కూడా చేయకుండా) తొలగించారు. ప్యాకేజీ నిబంధనల్లో భాగంగానే ఇదంతా జరిగింది. స్థానికులను తీసేసి ఒడిశా, బీహార్ ప్రాంతాల నుంచి కార్మికులను తెచ్చి వారికి ఎలాంటి కనీస వేతనాలు, హక్కులు, భద్రతా లేకుండా పనిచేయించుకుంటున్నారు. పైపెచ్చు ఇక్కడ కార్మికులు ఇళ్లల్లో ఉండి జీతాలు తీసుకుంటున్నారని, పనిచేయడం లేదని చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేశారు.

సొంతగనులు ఉంటేనే స్టీల్‌ప్లాంట్ పురోగమిస్తుంది. దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగ స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులను కేటాయించి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై మాత్రం పాలకులు వివక్షత ప్రదర్శించారు. ఎన్ఎండిసి ఐరన్ ఓర్‌ను మిట్టల్‌కు కట్టబెడుతున్నారు. 2010లోనే ఎన్ఎండిసి నుంచి వైజాగ్ స్టీల్‌కు పైప్‌లైన్ ద్వారా ఐరన్ ఓర్ సరఫరా చేయాలనే ఒప్పందానికి తూట్లు పొడిచారు. దీంతో, ఐరన్ ఓర్‌తో పాటు పెల్లెట్స్ కోక్‌ను ప్లాంట్ బయట కొంటోంది. టన్ను రూ.3 వేలు కాగా రూ.5 వేలు అదనంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్ వెచ్చించాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు వైజాగ్ స్టీల్‌ను వాడుతున్నామని ప్రభుత్వం చెబుతున్నా, రాయపూర్ నుంచి స్టీల్‌ను వాడుతోందని కేంద్ర ప్రభుత్వ మాజీ ఇంధన కార్యదర్శి ఇఎఎస్.శర్మ తెలిపారు. విశాఖ ఉక్కును తక్కుగా మార్చే ఈ కుట్రలను ప్రజల మద్దతుతో కార్మికవర్గం ప్రతిఘటిస్తోంది. ఇకపైనా ప్రజా ఉద్యమం కొనసాగితేనే కుట్రలను ఓడించడం సాధ్యమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## చమురు సంస్థల నుండి ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలని ధర్నా



**కాకినాడ, పతాకం న్యూస్:** ఇటీవల దరియాలతిప్ప ఐలాండ్ నెంబర్-3 సమీపంలో ఆగస్టు 22 తేది అర్ధరాత్రి ఓఎన్జిసి సంస్థకు చెందిన గ్యాస్ పైప్ లైన్ లీక్ అవ్వడంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బ్రతుకుతున్న తమకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దరియాలతిప్ప, సీతారామ నగర్, బాలయోగి నగర్, దొమ్మేటి పేట గ్రామాల ప్రజలు ప్రాంతీయ పరిపాలనాదధికారి కార్యాలయం ఎదుట రోడ్డుపై బైటాయించి ఆందోళన చేపట్టారు. ఆందోళనకారులు మాట్లాడుతూ గత 36 రోజులుగా నిరసన దీక్షలు చేపట్టిన ఓ ఎన్ జి సి అధికారులు,ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్ఏఓ అంకిత్ కుమార్, ఓ ఎన్ జి సి అధికారులకు వినతి పత్రాలు సమర్పించిన స్పందని లేకపోవడంతో ఆందోళన చేపట్టామన్నారు. ఓఎన్జిసి,రిలయన్స్ సంస్థల వల్ల సమీప ప్రాంతాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు.ఆయా పరిశ్రమల నుండి వస్తున్న కాలుష్యానికి గుండె సంబందిత,కిడ్నీ రోగాల భారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు.తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. చుట్టూ ఉన్న 4 గ్రామాలను చమురు సంస్థలు దత్తత తీసుకోవాలని, హెల్త్ ఇన్సూరెన్స్ చేయించాలని, తమ ప్రాణాలకు భద్రత కల్పించాలని, పైప్ లైన్ లీకేజీలు అవ్వకూడా పర్యవేక్షించాలని వారు డిమాండ్ చేసారు. అనంతరం ఆందోళనకారులతో ఆర్ ఏ ఓ అంకిత్ కుమార్ మాట్లాడారు. ప్రభుత్వం, చమురు సంస్థల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను వివరిస్తానని ఆర్ ఏ ఓ అంకిత్ కుమార్ చెప్పడంతో ఆందోళనను విరమించారు. అనంతరం వినతి పత్రం అందజేశారు.

ముందుగా ఆందోళనకారులు దరియాలతిప్ప నుండి బైక్ ర్యాలీ గా పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ కు చేరుకొని అక్కడ డా. బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి, పాదయాత్ర చేస్తూ ప్రాంతీయ పరిపాలనాదికారి కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు.ఎలాంటి ఘటనలు జరగకుండా ఎస్పీ వరదరాజన్ ఆధ్వర్యంలో ఎస్ ఐ లు పుణీత్ రాజ్, కట్టా సుబ్బరాజు,శేరు నూకరాజు భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు,మహిళలు,యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


## మరో ట్రూ అప్ బాదుడు వద్దు.. ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు అభ్యంతరం



**కర్నూలు, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం మరో ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.12,717 కోట్ల బాదుడును ప్రజలపై వేయాలన్న ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని పలువురు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి చైర్మన్ పివిఆర్ రెడ్డి ఆధ్వర్యంలో ట్రూ అప్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని కర్నూలులోని ఎపిఇఆర్‌సి కార్యాలయంలో నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ ఇప్పటికే అనేకసార్లు ట్రూ అప్ ఛార్జీలు వేసి ప్రజల నడ్డి విరగొట్టారు. మరోసారి రూ.12,717 కోట్లు భారం వేయడానికి ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో రావడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ప్రపంచ బ్యాంకు ఆదేశిత విద్యుత్ సంస్కరణల్లోని దుర్మార్గమైన షరతుల్లో ఇది ముఖ్యమైనదని పేర్కొన్నారు. ట్రూ అప్ ఛార్జీల విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో రూ.32 వేల కోట్ల భారం వేస్తే టిడిపి కూటమి ప్రభుత్వం సంవత్సరం ఏడు నెలల కాలంలోనే రూ.30 వేల కోట్ల భారం వేయడం దుర్మార్గమన్నారు. స్మార్ట్ మీటర్లను పగలకొట్టండని, తాము అధికారంలోకి వస్తే విద్యుత్ భారాలను వేయబోమని ప్రచారం చేసి ఓట్లు దండుకున్న టిటిపి కూటమి నాయకులు గత జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలనే చాలా వేగంగా అమలు చేస్తూ స్మార్ట్ మీటర్లను బిగించడం అమానుషమని పేర్కొన్నారు. 2022-23కు సంబంధించి ఇప్పటికే రూ.15,485 కోట్లు ఇంధన సర్దుబాటు ఛార్జీలు ప్రజలపై మోపారని, నెలకు యూనిట్‌కు 40 పైసలు చొప్పున ఏడాది కాలంలో రూ.2,787 కోట్లు వసూలు చేశారని తెలిపారు. విద్యుత్ సుంకాన్ని ఆరు పైసల నుండి రూపాయికి పెంచుతూ చట్టసవరణ చేశారని, 2024-25 సంవత్సరాలకు సంబంధించి ఇంధన సర్దుబాటు ఛార్జీలు రూ.842 కోట్ల వసూలుకు ప్రతిపాదనలు ఇఆర్‌సి ముందు ఉంచారని అన్నారు. ప్రజల కళ్లుగప్పి స్మార్ట్ మీటర్ల బిగింపునకు టిడిపి కూటమి ప్రభుత్వం పూనుకుందని, ముందుగా డబ్బులు చెల్లించి కరెంటు వాడుకునే విధానాన్ని రహస్యంగా ప్రవేశ పెడుతున్నారని వివరించారు. 2019లో వాడుకున్న విద్యుత్తుకు 2025లో చెల్లించమనడం ఏమిటని ప్రశ్నించారు. సెకీ ఒప్పందంపై విచారణ జరపకపోవడం అవినీతిని కప్పిపుచ్చుకోవడమేనని అన్నారు.

# 'బ్యాక్ పెయిన్' మీకు వెన్నులో నొప్పిగా ఉందా?

## డాక్టర్‌దగ్గరికి ఎప్పుడు వెళ్లాలో తెలుసా?



మనం ఏ పని చేయాలన్నా, అందుకు మన వెన్నెముక సహకరించాలి. నిలబడాలన్నా, కూర్చోవాలన్నా, బరువులు ఎత్తాలన్నా ఇలా ఏ పని చేయాలన్నా మన వెన్నెముక దృఢంగా ఉండాలి. కానీ, మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు మూలంగా ఇవాళ మన వెన్నెముకపై ఒత్తిడి పెరిగి, రోజురోజుకూ బలహీనంగా మారుతోంది. ఈ క్రమంలో చాలామంది వెన్నెముక డిస్కు జారిందని, నడుం నొప్పితో బాధపడుతున్నామని చెబుతుంటారు. ఇంతకీ డిస్కు అంటే ఏమిటి? ఇదెందుకు జారుతుందో ఇప్పుడు తెలసుకుందాం! వెన్నెముక పూసల మధ్య మందంగా, దృఢంగా రబ్బరులాంటి భాగాలుంటాయి. వీటినే డిస్కులు అంటారు. వంగటం, పక్కలకు తిరగటం వంటివి చేసినప్పుడు వెన్నుపూసలు మృదువుగా కదలటానికి తోడ్పడుతా యంటున్నారు నిపుణులు. వీటి మధ్య భాగంలో చిక్కటి ద్రవం, చుట్టూ గట్టి పీచులాంటి పదార్థం ఉంటాయని చెబుతున్నారు. ఇవి క్షీణించినా, దెబ్బతిన్నా వెలుపలి భాగం బలహీనమై చిట్లిపోవచ్చని హెచ్చరిస్తున్నారు. దీంతో లోపలున్న పదార్థాలు తోసుకురావొచ్చు, లీక్ కావొచ్చని, దీన్నే డిస్కు జారటం, ఉబ్బటం, చిట్లటం, ముందుకు పొడుచురావటం అంటున్నారు. ఇది వెన్ను మధ్యలో ఉండే నాడులను నొక్కటం వల్ల నడుం నొప్పి తలెత్తుతుందని, కాళ్లలోకి నొప్పి పాకు తున్నట్టు గానూ (సయాటికా) అనిపించొచ్చని తెలియజేస్తున్నారు. ఏ నాడి ప్రభావితమైందనే దాన్ని బట్టి మొద్దుబారటం, పొడుస్తున్నట్లు అనిపించటం, కండరం బలహీనం కావటం వంటివీ ఉంటాయని పేర్కొంటున్నారు. కొందరికి నొప్పి స్వల్పంగానే ఉంటే, మరికొందరికీ చాలా తీవ్రంగా వేధించొచ్చని వెల్లడిస్తున్నారు. అరుదైన సందర్భాల్లో, ఇది పక్షవాతం, కాళ్లలో జలదరింపు లేదా మూత్రాశయం లేదా ప్రేగు సమస్యలను కూడా కలిగిస్తుందని అధ్యయనం పేర్కొంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, బరువులు సక్రమంగా ఎత్తటం, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లతో డిస్కు జారిపోకుండా చూసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. నడక, ఈత, పరుగు వంటి వ్యాయామాల వల్ల వెన్నెముక మృదువుగా కదలటానికి, బలంగా ఉండటానికి తోడ్పడతాయంటున్నారు. అడ్డదిడ్డంగా బరువులు ఎత్తొద్దని తెలియజేస్తున్నారు. అదిరినట్టుగా పక్కలకు తిరగొద్దని పేర్కొంటున్నారు. ఎలాపడితే అలా జారగిల్లొద్దని, ఏ పనిచేస్తున్నా శరీర భంగిమ సరిగా ఉంచుకోవటానికి ప్రయత్నించాలని వివరిస్తున్నారు.

ఎక్కువసేపు కూర్చొని పనులు చేసేవారు మధ్యమధ్యలో కుర్చీలోంచి లేచి, కాసేపు అటూ, ఇటూ నడవాలని నిపుణులు చెబుతున్నారు. బరువు అదుపులో ఉంచుకుంటే డిస్కుల మీద భారం పడకుండా చూసుకోవచ్చని అంటున్నారు. సిగరెట్లు అలవాటుంటే మానెయ్యాలని సూచిస్తున్నారు. ఎందుకంటే పొగలోని నికొటిన్ డిస్కు కణజాలాన్ని బలహీనం చేస్తుందని చెబుతున్నారు. చురుగ్గా ఉండటం, నొప్పి నివారణ మందులు తీసుకోవడం వల్ల జారిన డిస్క్ వల్ల కలిగే నొప్పి తగ్గుతుందని అధ్యయనం పేర్కొంది. డిస్కు జారిందనగానే సర్జరీ తప్పదని చాలామంది అపోహ పడుతుంటారు. కానీ, ఇది నిజం కాదంటున్నారు నిపుణులు. 90 శాతం మందికి తగినంత విశ్రాంతి, మందులు, ఫిజియోథెరపీ వ్యాయామాలతోనే మంచి ఫలితం కనిపిస్తుందని చెబుతున్నారు. ఈ క్రమంలో నొప్పి ఉన్నప్పుడు కొద్దిరోజులు విశ్రాంతి తీసుకోవటం మంచిదని తెలియజేస్తున్నారు. వేడి కాపు, ఐస్ అద్దటం, నెమ్మదిగా సాగదీయటం ఉపయోగపడతాయని వివరిస్తున్నారు. ఇలాంటి సమయంలో పూర్తిగా మంచానికే అతుక్కుపోవాల్సిన పనిలేదని, నడుం మీద ఎక్కువ భారం పడకుండా తేలికపాటి వ్యాయా మాలు, నడక, ఈత వంటివి చేయాలని సలహా ఇస్తున్నారు. అలాగే, డాక్టర్ల సలహా మేరకు నొప్పిని తగ్గించే మందులు వేసుకోవాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా, శరీర భంగిమ సరిగా ఉండేలా చూసుకోవటం, వెన్నుకు దన్నుగా ఉండే కుర్చీలు వాడుకోవటం వంటివి నొప్పి నుంచి త్వరగా కోలుకోవటానికి తోడ్పడతాయని పేర్కొంటున్నారు. నడుస్తున్నప్పుడు, కూర్చున్నప్పుడు, నిలబడినప్పుడు, నిద్రపోతున్నప్పుడు శరీర భంగిమను ఎలా మెరుగుపరచుకోవాలో తెలుసుకోవాలని, మంచి భంగిమ వెన్నెముకపై ఒత్తిడిని తగ్గిస్తుందని అధ్యయనం పేర్కొంది.

రెండు, మూడు వారాలు దాటినా నొప్పి తగ్గకపోతే, నొప్పి మాత్రలతో ఉపశమనం కలగకపోతే, రోజువారీ పనులు చేసుకోలేనంతగా నొప్పి వేధిస్తుంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలంటున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో బలహీనత ఎక్కువ కావటం, సరిగి నడవలేకపోవటం వంటి తీవ్ర లక్షణాలు కనిపిస్తే అసలే నిర్లక్ష్యం చేయొద్దని, త్వరగా చికిత్స తీసుకుంటే దీర్ఘకాల దుష్ప్రభావాలను తప్పించుకోవచ్చని తెలియజేస్తున్నారు.

# మీ చర్మానికి ఏ సబ్బు వాడాలో తెలుసా..?





పులిపిరి కాయల సమస్య ప్రతి ఒక్కరిలో కనిపిస్తుంది. వీటిని ఉలిపిరి కాయాలని కూడా అంటారు, ఇంగ్లీష్‌లో వీటిని వార్ట్ష్ అంటారు. హ్యూమన్ పాపిలోమా అనే వైరస్ వల్ల ఈ పులిపిరులు ఏర్పడతాయి. ఇవి ఎక్కువగా ముఖం, మెడ, చేతులు, పాదాలపై వస్తుంటాయి. చర్మంలో కలిసిపోయే కొన్ని పులిపిర్లు పెద్దగా నొప్పిరావు. కానీ, కొన్ని దురద పుడుతుంటాయి.

చేతి వేళ్ల చుట్టూ వచ్చే పులిపిర్లను కామన్ వార్ట్ష్ అని అంటారు. పాదాలపై వచ్చే పులిపిర్లను ప్లాంటార్ వార్ట్ష్ అంటారు. ముఖం, మెడ మీద వచ్చే పులిపిర్లను ఫ్లాట్ వార్ట్ష్ అని అంటారు. కొంతమందికి జననాంగాలపై కూడా ఇవి ఏర్పడతాయి. వాటిని జనైటల్ వార్ట్ష్ అని పిలుస్తారు.

వైరల్ ఇన్ఫెక్షన్స్‌తో..: రోగనిరోధక శక్తి లోపించినప్పుడు, హార్మోన్ల అసమతుల్యత ఏర్పడినప్పుడు కొన్ని రకాల వైరస్‌లు శరీరంపై దాడి చేస్తాయి. ఈ నేపథ్యంలో కొందరికి పులిపిర్లు ఏర్పడతాయి. పులిపిర్లను కత్తిరించటం, కాల్చటం వంటివి చేయకూడదు. ఇవి ఎక్కువగా రాపిడిగా ఉండే ప్రాంతాల్లోనే ఏర్పడతాయి. ఇంటి చిట్కాలు లేదా వైద్యులను సంప్రదించి వీటిని మటుమాయం చేయొచ్చు. ముఖ్యంగా ఈ 5 ఇంటి చిట్కాలతో పులిపిర్లు నుంచి ఉపశమనం పొందవచ్చు. 1. యాపిల్ సిడర్ వెనిగర్: వీటిలో అధిక యాసిడ్ కంటెంట్ ఉంటుంది. దీనివల్ల పులిపిర్లు మరింత పెరగకుండా సహజ సిద్ధంగా తగ్గిపోతాయి. దూదిని యాపిల్ సిడర్ వెనిగర్‌లో ముంచి పులిపుర్లు ఉన్నచోట అద్దితే చాలు. వారంలో కనీసం ఐదు రోజులు ఇలా పూర్తిగా మాయమవుతాయి. 2. కలబంద: ఇందులో ఉండే మేలిక్ యాసిడ్ పులిపిర్లలోని ఇన్ఫెక్షన్లతో పోరాడుతుంది. ఇందుకు మీరు కలబంద ఆకు మధ్యలో ఉండే జిగురును తీసుకుని పులిపిర్లపై రాస్తే చాలు. 3. బేకింగ్ పౌడర్: ఆముదంలో కాస్త బేకింగ్ పౌడర్ వేసి బాగా కలపండి. దాన్ని పులిపిర్లపై రాసి బ్యాండేజ్ వేయండి. అలా రాత్రంతా వదిలిపెట్టండి. ఇలా రెండు నుంచి మూడు రోజులు చేసినట్లయితే పులిపిర్లు పూర్తిగా తొలగిపోతాయి. 4. అరటి పండు తొక్క: అరటి పండు తొక్కలో ఉండే ఎంజైమ్‌లు చర్మానికి మేలు చేస్తాయి. అరటి పండు తొక్కతో రోజు పులిపిర్లపై రుద్దితే అది క్రమేనా కనుమరుగు అవుతుంది.5. వెల్లులి: చర్మ వ్యాధుల నివారణకు వెల్లులి మంచి ఔషదం. ఇందులో ఉండే ఎల్లిసిన్.. ఫంగస్, వైరస్ వంటి బ్యాక్టీరియాలతో పోరాడుతుంది. అలాగే పులిపిర్లను తొలగించడంలోనూ ఇది అత్యుత్తమంగా పనిచేస్తుంది. ఇందుకు మీరు వెల్లులి ముద్దగా చేసుకుని పులిపిర్లు ఉన్నచోట రాస్తే చాలు.

# శబరిమల రైళ్లు ఫుల్






**విశాఖపట్నం, పతాకం న్యూస్:** అయ్యప్ప మాలధారుల సంఖ్య ఈ ఏడాది గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఎర్నాకులం, కొల్లాం ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో జనవరి వరకూ బెర్తులు లభించని పరిస్థితి నెలకొంది. బొకారో ఎక్స్‌ప్రెస్ (13351), టాటా-ఎర్నాకులం (18189) వంటి రెగ్యులర్ రైళ్లతోపాటు ప్రతి గురువారం విశాఖ నుంచి బయలుదేరే కొల్లాం ఎక్స్‌ప్రెస్ (18567)లో జనవరి 15 వరకూ బెర్తులు ఖాళీ లేవు. అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ప్రతి మంగళవారం విశాఖలో బయలుదేరి బుధవారం కొల్లాం చేరేలా వాల్తేరు రైల్వే అధికారులు ప్రవేశపెట్టిన ప్రత్యేక రైలుకు మిశ్రమ డిమాండ్ ఏర్పడింది. ప్రత్యేక రైలు (08539)లో డిసెంబరు 9, 16, 23, 30, జనవరి 6 తేదీల్లో ఏసీ కోచ్‌లలో, డిసెంబరు 30, జనవరి 6న స్లీపర్‌లో ఖాళీలు ఉన్నాయి. విశాఖ-కొల్లాం ఎక్స్‌ప్రెస్ (18567)కు జనవరి 15 వరకు బెర్తులు నిండిపోయాయి. అత్యధిక శాతం అయ్యప్ప భక్తులు ఈ రైలునే ఆశ్రయిస్తారు. అయితే విశాఖ నుంచి కొల్లాంకు ఒకే ఒక ఒరిజినేటింగ్ రైలు (వారాంతపు) అందుబాటులో ఉన్న నేపథ్యంలో అయ్యప్ప భక్తుల అవసరాలు తీరడం లేదు. గతంలో నాలుగు నెలల ముందస్తు రిజర్వేషన్ సదుపాయం ఉన్నప్పుడు మాలధారణకు ముందే యాత్ర తేదీలకు అనుగుణంగా రిజర్వేషన్ పొందేవారు. ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని రెండు నెలలకు కుదించడంతో అయ్యప్ప భక్తులకు ఆశించిన స్థాయిలో బెర్తులు లభించే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో విశాఖ మీదుగా ఎర్నాకులం చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లే రైళ్లను ఆశ్రయిస్తున్నారు.

విశాఖ-కొల్లాం ఎక్స్‌ప్రెస్ (18567) రైళ్ల సర్వీసుల ఫ్రీక్వెన్సీ పెంచాలని ప్రయాణికుల నుంచి డిమాండ్ ఉన్నా రైల్వే అధికారులు దృష్టి సారించడం లేదు. కొల్లాం ఎక్స్‌ప్రెస్‌కు కేవలం శబరిమలై యాత్ర సమయంలోనే కాకుండా సాధారణ రోజుల్లోనూ ఆక్యుపెన్సీ ఎక్కువగానే ఉంటోంది. రేణిగుంట, గూడూరు మీదుగా వెళ్లే కొల్లాం ఎక్స్‌ప్రెస్‌కు తిరుపతి ప్రయాణికుల డిమాండ్ ఉంది. దరిమిలా వారానికి రెండు రోజులు (బైవీక్లీ) అందుబాటులో ఉండేలా ఫ్రీక్వెన్సీ పెంచితే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

విశాఖ మీదుగా నడిచే ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ (13351)లో జనవరి 17వ తేదీ వరకూ అన్ని తరగతుల బెర్తులు నిండిపోయాయి. అలాగే బొకారో ఎక్స్‌ప్రెస్‌తో కనెక్టవిటీ నడిచే టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189)కు కూడా అంతే డిమాండ్ నెలకొంది. వీటితోపాటు రోజూ నడిచే డిబ్రుగర్-నాగర్‌కోయిల్ వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504)లో జనవరి 16 వరకు బెర్తులు ఫుల్ అయిపోయాయి.

వివిధ ప్రాంతాల నుంచి విశాఖ మీదుగా ఎర్నాకులం చేరే వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనవరి 16 వరకు బెర్తులు లభించే పరిస్థితి లేకుండా పోయింది. ప్రతి గురువారం నడిచే షాలిమార్-నాగర్‌కోయిల్ గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ (12660) జనవరి 15 వరకు, ప్రతి సోమ, బుధవారం అందుబాటులో ఉండే షాలిమార్-త్రివేంద్ర ఎక్స్‌ప్రెస్ (22642) జనవరి 14 వరకు, ప్రతి శుక్ర, శనివారం నడిచే పాట్నా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (22644) జనవరి 9 వరకు, ప్రతి శనివారం అందుబాటులో ఉండే సిల్చార్-త్రివేంద్రం ఎక్స్‌ప్రెస్‌కు (12508) జనవరి 3 వరకు, ప్రతి మంగళవారం నడిచే హటియా-ఎర్నాకులం ధాత్రి అబ్బా ఎక్స్‌ప్రెస్ (22837)లో జనవరి 6 వరకూ బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా ఉంది.

అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం వాల్తేరు రైల్వే అధికారులు 2023లో శ్రీకాకుళం-కొల్లాం మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడిపారు. ఈ ఏడాది అయ్యప్ప మాలధారుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో గతంలో మాదిరిగా శ్రీకాకుళం రోడ్డు, కొల్లాం మధ్య ప్రవేశపెట్టాలని అయ్యప్ప భక్తులు కోరుతున్నారు.

# గ్రేటర్ నొయిడాలోని ఇస్తాంబుల్ ఇంటర్నేషనల్ ప్రెస్‌పై ఏటీఎస్ దాడులు




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఢిల్లీ పేలుళ్ల కేసులో ఉత్తరప్రదేశ్‌కి చెందిన ఉగ్రవాద నిరోధక బృందం (ఏటిఎస్) గ్రేటర్ నొయిడాలోని ఇస్తాంబుల్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌పై సోదాలు జరిపింది. ఇస్తాంబుల్ ఇంటర్నేషనల్ ప్రై.లి ప్రెస్‌లో మత విద్వేషాలను రెచ్చగొట్టే కంటెంట్‌ను ప్రచురిస్తున్నట్లు తెలిపింది. విచారణలో భాగంగా సిసిటివి ఫుటేజీతో పాటు పలు డాక్యుమెంట్లు, ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఢిల్లీ పేలుళ్లకు టర్కీతో కార్యాచరణ మరియు ఆర్థిక సంబంధాలు ఉన్నట్లు భద్రతా సంస్థలు గుర్తించడంతో దర్యాప్తు వేగవంతమైంది. నివేదిక ప్రకారం.. అనుమానిత కీలక సూత్రధారి డా.ఉమర్‌ఉన్ నబీ 2022లో టర్కీ వెళ్లాడని, అక్కడ విదేశీ హ్యాండ్లర్‌తో సమావేశమయ్యాడని తెలిపింది. ఈ హ్యాండ్లర్ భారత్‌లో టెర్రర్ మాడ్యూల్‌ను ఏర్పాటు చేయడం, నిర్వహించడంపై వివరణాత్మక సూచనలు చేశాడని పేర్కొంది. పేలుడు పదార్థాలు, ఇతర వనరులను సేకరించడానికి టర్కీ ఆధారిత నెట్‌వర్క్‌ల ద్వారా వారికి ఆర్థిక సాయం అందించాడని వెల్లడించింది. దీంతో టర్కీతో సంబంధాలు ఉన్న సంస్థలపై దాడులు నిర్వహిస్తున్నట్లు ఏటిఎస్ ప్రకటించింది. టర్కీలో ఉన్న సమయంలో డా.ఉమర్, అతని సహచరులకు జైషే-మొహమ్మద్ సంస్థతో అక్రమ సంబంధాలు కలిగి ఉండటంతో పాటు సైద్ధాంతిక మార్గదర్శకంతో పాటు నిర్వహణకు సంబంధించి శిక్షణ తీసుకున్నాడని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. పేలుడు పదార్థాలు, లాజిస్టికల్ వనరుల సేకరణకు ఆర్థిక సాయం టర్కీకి చెందిన నెట్‌వర్క్‌ల నుండి మళ్లించారని తెలిపాయి. మాడ్యూల్‌లోని పలువురు సభ్యులు నిఘా వ్యవస్థలను తప్పించుకుంటూ, విదేశాల్లో ఉన్న హ్యాండర్లను సమన్వయంచేసుకోవడానికి ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ చానల్‌ని ఉపయోగించారని వెల్లడించాయి.




# డేవిస్ కప్ ఫైనల్స్‌కు అల్కరాజ్ దూరం



డేవిస్ కప్ ఫైనల్స్‌కు స్పెయిన్ యువ సంచలనం, టాప్‌సీడ్ కార్లోస్ ఆల్కరాజ్ దూరమయ్యాడు. గాయం కారణంగా అతడు డేవిస్ కప్ మ్యాచ్‌లకు దూరమైనట్లు స్పెయిన్ ఆటగాడు సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. 'బొలోగ్నా వేదికగా జరిగే డేవిస్ కప్ క్వార్టర్‌ఫైనల్లో ఆడలేనని ప్రకటించడానికి బాధగా ఉంది. కుడికాలు గాయం తీవ్రత తగ్గని కారణంగా వైద్యులు టోర్నీలకు దూరంగా ఉండాలని సూచించారు. డేవిస్‌కప్ అనేది పెద్ద టోర్నీ అని తెలిసినా.. వైదొలుగుతున్నందుకు చింతిస్తూ గుండె పగిలి ఇంటికి వెళ్తున్నాను..' అని అల్కరాజ్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఈనెల 18 నుంచి 23వరకు ఇటలీలోని బొలోగ్నా వేదికగా స్పెయిన్ జట్టు చెక్ రిపబ్లిక్‌తో క్వార్టర్‌ఫైనల్లో తలపడనుంది. నాన్ ప్లేయింగ్ కెప్టెన్ డేవిడ్ ఫెర్రర్ సారథ్యంలోని స్పెయిన్ జట్టులో జౌమ్ మునార్, పాబ్లో కరెనో బూస్టా, ఫెడ్రో మార్టినేజ్, మార్సెల్ గ్రానోలర్స్ ఇతర ఆటగాళ్లు. అల్కరాజ్ స్థానంలో ప్రపంచ 14వ ర్యాంకర్ అలెగ్జాండ్రో డేవిడోవిచ్‌ను ఎంపికయ్యే ఛాన్స్ ఉంది.

# గిల్, కుల్దీప్ యాదవ్ దూరం కాబోతున్నారా..

# రెండో టెస్ట్‌లో భారీ మార్పులు




నవంబర్ 22 నుంచి గువాహటిలో రెండో టెస్ట్ మ్యాచ్ మొదలు కాబోతోంది. ఈ కీలక మ్యాచ్‌కు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ దాదాపు దూరమైనట్టు సమచారం. జట్టుతో పాటు గిల్ కూడా ఇప్పటికే గువాహటికి వెళ్లాడు. అయితే మెడ గాయం కారణంగా గిల్ ఈ మ్యాచ్‌లో ఆడేది అనుమానమే

దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ మ్యాచ్‌లో ఓడిపోయిన టీమిండియా గువాహటిలో రెండో మ్యాచ్‌కు సిద్ధమవుతోంది.


ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే టెస్ట్ సిరీస్‌ను టీమిండియా సమం చేయగలదు. నవంబర్ 22 నుంచి ఈ టెస్ట్ మ్యాచ్ మొదలు కాబోతోంది. ఈ కీలక మ్యాచ్‌కు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ దాదాపు దూరమైనట్టు సమచారం. జట్టుతో పాటు గిల్ కూడా ఇప్పటికే గువాహటికి వెళ్లాడు. అయితే మెడ గాయం కారణంగా గిల్ ఈ మ్యాచ్‌లో ఆడేది అనుమానమే.

గిల్ ఆరోగ్యం విషయంలో వైద్య బృందం తుది నివేదిక ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, అతడికి విశ్రాంతి ఇవ్వాలనే అభిప్రాయం టీమ్ మేనేజ్‌మెంట్‌లో కనిపిస్తోంది. ఇక, గిల్‌తో పాటు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కూడా ఆడకపోవచ్చనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. కుల్దీప్ యాదవ్ కూడా ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతున్నాడట. దీంతో అతడు అందుబాటులో ఉండేది కూడా అనుమానంగా మారింది. గిల్ గైర్హాజరీ కారణంగా రిషభ్ పంత్ ఈ టెస్ట్‌కు నాయకత్వం వహించే అవకాశాలు కనబడుతున్నాయి

గిల్ అందుబాటులో లేకపోవడంతో అతడి స్థానంలో తెలుగు ఆటగాడు నితీష్ కుమార్ రెడ్డి, రజత్ పటిదార్‌లలో ఒకరికి అవకాశం లభించవచ్చు . ఇక, కుల్దీప్ స్థానంలో ఆడే స్పిన్నర్ ఎవరనే విషయంలో పూర్తి స్పష్టత లేదు. తుది జట్టు విషయంలో ఇప్పటికి ఇంకా పూర్తి క్లారిటీ రాలేదు. ఏదేమైనా గువాహటి టెస్ట్ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలని భారత్ కృత నిశ్చయంతో ఉంది.




# ‘12ఏ రైల్వే కాలనీ’ సూపర్ హిట్ గ్యారెంటీ: అల్లరి నరేశ్



విలక్షణ నటుడు అల్లరి నరేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘12ఏ రైల్వే కాలనీ’. ఈ సినిమా ప్రీ-రిలీజ్ వేడుకలో నరేష్ మాట్లాడుతూ ఒక ఆసక్తికరమైన సెంటిమెంట్‌ను పంచుకున్నారు. ‘నా సామి రంగ’ సినిమా షూటింగ్‌లో తన కాలుకు గాయమైందని, అప్పుడు నిర్మాత శ్రీనివాస చిట్టూరి అది మంచి సెంటిమెంట్ అని చెప్పారని గుర్తు చేసుకున్నారు. ఆయన చెప్పినట్లే ఆ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిందని తెలిపారు.

ఇదే సెంటిమెంట్‌ను ప్రస్తావిస్తూ, “‘12ఏ రైల్వే కాలనీ’ సినిమా చిత్రీకరణ సమయంలో నా భుజానికి గాయమైంది. కాబట్టి ఈ సినిమా కూడా కచ్చితంగా పెద్ద విజయం సాధిస్తుందని నమ్మకంగా ఉన్నాను” అని నవ్వుతూ అన్నారు. తాను 64 చిత్రాల్లో నటించినప్పటికీ, సినిమా విడుదల తేదీ దగ్గరపడేకొద్దీ ఫలితం ఎలా ఉంటుందోనన్న టెన్షన్ ఇప్పటికీ ఉంటుందని నరేశ్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా దర్శకుడు నాని కాసరగడ్డపై ప్రశంసలు కురిపించారు. “నాని తన మొదటి సినిమా చేస్తున్నా ఎలాంటి టెన్షన్ లేకుండా చాలా నమ్మకంగా ఉన్నాడు. మనం చేసిన ప్రొడక్ట్ బాగుందని నమ్మినప్పుడే ఆ ధీమా వస్తుంది” అని అన్నారు. తాను తన కెరీర్‌లో ఇప్పటివరకు 35 మంది కొత్త దర్శకులతో పనిచేశానని, ఓ దర్శకుడి కొడుకుగా వారికి ఎప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు.

తాను హారర్ థ్రిల్లర్ జోనర్‌లో నటించడం ఇదే మొదటిసారని, చిత్ర బృందం మొత్తం ఎంతో కష్టపడి పనిచేసిందని నరేశ్ తెలిపారు. నాని కాసరగడ్డ దర్శకత్వం వహించిన ఈ చిత్రం, ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారని, ఇది నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రానుందని వెల్లడించారు.

# నాకు డబ్బులు ముఖ్యం కాదు దీపికా పదుకొణె



బాలీవుడ్ అగ్రనటి దీపికా పదుకొణె ఇటీవల రెండు భారీ పాన్ ఇండియా ప్రాజెక్టులను తిరస్కరించడంపై స్పష్టత ఇచ్చారు. ప్రభాస్ హీరోగా రానున్న ‘కల్కి’ సీక్వెల్, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలోని ‘స్పిరిట్’ సినిమాల్లో నటించక పోవడానికి కారణం పారితోషికం లేదా డేట్స్ కాదని, ఆరోగ్యకరమైన పని వాతావరణానికే తన తొలి ప్రాధాన్యత అని ఆమె వెల్లడించారు.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తన నిర్ణయంపై వస్తున్న విమర్శలకు దీపికా సమాధానమిచ్చారు. “సినిమా బడ్జెట్ రూ.100 కోట్లా లేక రూ.500-600 కోట్లా అనేది నా నిర్ణయాలపై ప్రభావం చూపదు. కొందరు భారీ పారితోషికం ఆఫర్ చేస్తారు. కానీ నాకు అది ముఖ్యం కాదు” అని ఆమె తెలిపారు. సినిమా స్థాయిని బట్టి తన ప్రాధాన్యతలు మారవని ఆమె పరోక్షంగా వెల్లడించారు. ఆరోగ్యకరమైన పని వాతావరణం ఉన్నప్పుడే ఉత్తమమైన నటనను ఇవ్వగలమని దీపిక పేర్కొన్నారు. “ప్రతిరోజూ ఎనిమిది గంటల పనివేళలు సరిపోతాయి. మనం ఆరోగ్యంగా ఉన్నప్పుడే మన పనిలో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వగలం” అని ఆమె వివరించారు. ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.కాగా, దీపికా పదుకొణె ఇటీవలే ప్రభాస్ ‘కల్కి 2898 ఏడీ’లో కీలక పాత్రలో కనిపించారు. ప్రస్తుతం ఆమె అల్లు అర్జున్, అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ పాన్ ఇండియా చిత్రంలో (AA22xA6) కథానాయికగా నటిస్తున్నారు.

# ‘కిల్లర్’ సర్ ప్రైజ్ చేస్తుంది



జ్యోతి పూర్వజ్, పూర్వజ్, మనీష్ గిలాడ లీడ్ రోల్స్ లో నటిస్తున్న సినిమా “కిల్లర్”. చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ధ్యానం నాన్న ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వజ్, పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వజ్ దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతున్న ఈ సినిమా నుంచి ఫైర్ అండ్ ఐస్ సాంగ్ ు ఈ రోజు హైదరాబాద్ లో లాంఛ్ చేశారు. ఈ కార్యక్రమంలోయాక్షన్ కొరియోగ్రాఫర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ - జ్యోతి గారు తనకు యాక్షన్ తెలియదు అనేవారు. కానీ మేము 15 మందితో అటాక్ చేసే ఒక యాక్షన్ సీక్వెన్స్ ప్లాన్ చేశాం. ఆ సీక్వెన్స్ రెడీ చేయడానికి మాకు 3 గంటలు టైమ్ పట్టింది. కానీ జ్యోతి గారు వచ్చి అరగంటలో మొత్తం యాక్షన్ పార్ట్ చేశారు. మేము షాక్ అయ్యాం. ఈ సినిమాలో జ్యోతి గారు చేసిన యాక్షన్ సీక్వెన్సులకు మంచి రెస్పాన్స్ వస్తుంది. అన్నారు.

యాక్టర్ సీతారామ్ మాట్లాడుతూ డైరెక్టర్ పూర్వజ్ చాలా కష్టపడతారు. జ్యోతి గారిని టీవీల్లో చూశాం. ఇప్పుడు బిగ్ స్క్రీన్ మీద మనల్ని ఆకట్టుకోబోతున్నారు. ఆమె ఈ చిత్రంలో అద్భుతంగా పర్ ఫార్మ్ చేశారు. “కిల్లర్” సినిమా చూసిన ఆడియెన్స్ సర్ ప్రైజ్ అవుతారు. అన్నారు. యాక్టర్ మనీష్ గిలాడ మాట్లాడుతూ ఈ చిత్రంలోకి వైల్డ్ కార్డ్ ఎంట్రీలా అడుగుపెట్టా. నాలోని విలనీని కొత్తగా తెరపై చూపించబోతున్నారు దర్శకులు పూర్వజ్. విజువల్స్ సూపర్బ్ గా వచ్చాయి. ప్రేక్షకులంతా ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుంది. అన్నారు. యాక్టర్ విశాల్ రాజ్ మాట్లాడుతూ “కిల్లర్” సినిమాలో జ్యోతి పూర్వజ్ గారితో కలిసి నటించడం హ్యాపీగా ఉంది. ఆమె ఈ చిత్రంలో బాగా పర్ ఫార్మ్ చేశారు. తన కోసమైనా ఈ సినిమాను మీరు చూడాలి. డైరెక్టర్ పూర్వజ్ తో వర్క్ చేయడం ఏ నటుడికైనా సులువు. మనకెంతో ఫ్రీడమ్ ఇస్తారు. మీతో పాటే నేను ఈ సాంగ్ చూస్తున్నా. డైరెక్టర్ పూర్వజ్ ఇంకా పెద్ద మూవీస్ చేయాలని కోరుకుంటునన్నారు.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**